honeybee.org
Vol-12 Issue-5
వెల : రూ. 20/-

సంపుటి 12 సంచిక 6 సెప్టెంబర్ - అక్టోబర్ 2024

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

100 వ సంచిక


అమేజింగ్ ఇండియన్


50TH చిన్న శోధయాత్ర







కరెంట్ అవసరం లేదు, ఇంధనం అవసరం లేదు మీకు కావాల్సిన నీరు తోడేసుకోవచ్చు

# గద్వాల రైతు సదస్సులో 'పల్లెసృజన' ఇన్నోవేషన్ల ప్రదర్శన చిత్రాలు








26-10-2024 న తెలంగాణ లోని గద్వాల జిల్లా కేంద్రంలో స్థానిక గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో 'రైతు సేవా సమితి' వారు "రైతు సదస్సు" కార్యక్రమాన్ని నిర్వహించడమైనది. ఈ సదస్సులో శాసన సభ్యుని కోరిక మేరకు మన 'పల్లెసృజన' ఇన్నోవేషన్‌ల ప్రదర్శనను ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనలో 17 మంది తో పాటు 'క్రియేటివ్ మైండ్స్' నుండి సుభాష్ చందర్ కూడా పాల్గొనడం జరిగింది. ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా, కార్యక్రమానికి హాజరు కాలేని కొంతమంది ఇన్నోవేటర్ల ఇన్నోవేషన్లను సుభాష్ చందర్ పర్యవేక్షణలో ప్రదర్శించడమైనది. కార్యక్రమానికి సుమారు 4 వేల మంది దాకా హాజరయ్యారని నిర్వాహకులు తెలియజేశారు. ఈ మొత్తం కార్యక్రమంలో రైతులు ప్రధానంగా 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను చాలా శ్రద్ధతో పరిశీలించి, వీటివల్ల ఎంతగా తమ వ్యవసాయ పనుల్లో లాభాలు జరుగుతాయో తమతో తాము చర్చించుకోవటం జరిగింది. ఈ ప్రదర్శనలో చిన్న చిన్న వ్యవసాయ పనిముట్లను బాగా ఆదరించి, కొనుగోలు కూడా చేయటం జరిగింది. కలెక్టరు గారు పల్లెసృజన ఇనోనవేషన్ల పట్ల ముగ్ధులైన విషయం వారి మాటల్లోనే వేదికపైన రైతులకు వివరించడం ఒక ప్రత్యేకత సంతరించుకుంది. మన ఇన్నోవేటర్ నాగభూషణం తయారు చేసిన బిస్కట్లు తయారు చేసే ఓవెన్‌ను తమ కార్యాలయలోని మహిళా ఫుడ్ కోర్ట్ వారికి ఏర్పాటు చేయించమని తమ అధికారులకు అక్కడే ఆదేశించారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి గారు మరియు కలెక్టర్ గారు మిగతా ఇన్నోవేషన్ల గురించి కూలంకషంగా చర్చించి వీటిని జిల్లా రైతాంగానికి అందజేసేందుకు మనం త్వరలో ప్రత్యేకంగా ఒక సమావేశం ఏర్పాటు చేసుకుందామని తెలియజేశారు. ఆ సమావేశంలో మోధా శివకుమార్ ఇన్నోవేషన్ 'పెడల్ లిఫ్టింగ్' యంత్రం, మరికొన్ని వ్యవసాయ యంత్రాలను స్థానిక ప్రజానీకానికి అందజేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించవలసిన అవసరముందని ఈ ప్రదర్శన నిర్వాహకుడు పల్లె వీరరాఘవ రెడ్డితో స్వయంగా కలెక్టరు గారు మరియు ఎమ్మెల్యే చెప్పటం ఓ ప్రత్యేకత.

సంపుటి-12 సంచిక - 6 సెప్టెంబర్ - అక్టోబర్ 2024

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–49253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

## సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

సంపాదకులు :
జమ్మలమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
ప్రొ. అనిల్ గుప్త
జాగర్లమూడి దుర్గాప్రసాద్
జమ్మలమడక శ్రీకర్
డా. కల్పనా శాస్త్రి

డిజైనింగ్ & ప్రింటింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 200/-**
**for 1 year Subscription**

## ఈ సంచికలో.....

* సహజ కలుపు నివారణి - వరి పైరుకు సంజీవని - 4
* శత ప్రతుల 'పల్లెసృజన' - 6
* 'జి-20' 'సి-20' 'లైఫ్' అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశ సమ్మతులు - 10
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 11
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 14
* యువత అవగాహనకై సంస్కృతం మరియు తెలుగులో పకృతిలో లభించే చెట్ల పేర్లు - 18
* కరెంటు, ఇంధనం అవసరం లేకుండా నీటి పారుదల 'ర్యాం పంపు, హైడ్రో లిఫ్టింగ్ పంపులు ఏర్పాటు చేసిన "పంపన శ్రీనివాస్" - 20
* పల్లె జ్ఞానం - 23
* 'పల్లెసృజన' ఇన్నోవేటర్ "మహిపాల్ చారి"కి "అమేజింగ్ ఇండియన్" పురస్కారం - 25
* భీమలింగయ్య గారి వినూత్న, విజయవంతమైన వ్యవసాయ ప్రయోగం - 26
* ఎన్ఐఎఫ్ వారి 'ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఫైన్-2023) పురస్కారాలు - 28
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 32

<u>కవర్ లోపలి పేజీలో ...</u>
గద్వాల రైతు సదస్సులో 'పల్లెసృజన' ఇన్నోవేషన్ల ప్రదర్శన చిత్రాలు
<u>మధ్య పేజీలో :</u>
సెప్టెంబర్–అక్టోబర్ 2024 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# 50 చిన్న శోధయాత్రలు - ప్రకృతి, ప్రజలతో మమేకం

'పల్లెసృజన' ఒక స్వచ్ఛంద సంస్థ. దీని నిర్వాహకులు, వాలంటీర్లు అంతా స్వచ్ఛందం గా పని చేస్తారు. గ్రామాల్లోవున్న సృజనాత్మకతను వెతికి, సమాజానికి తెలియపరచడం, సృజనాత్మ కత గల వ్యక్తులను (ఇన్నోవేటర్స్‌ను) గౌరవించి వారిని ప్రపంచానికి పరిచయం చేయాలన్న ప్రధాన లక్ష్యంతో 2005లో 'పల్లెసృజన' స్థాపించబడింది. చదువుకోని గ్రామ ప్రజల్లో కూడా శాస్త్రవేత్తలు ఉన్నారని త్రికరణశుద్ధిగా 'పల్లెసృజన' నమ్ముతుంది. అలాంటి జ్ఞానవేత్తల జ్ఞానాన్ని గుర్తించి, గ్రంథీకరించి, ఆ జ్ఞానాన్ని సమాజానికి అందించటంతో పాటు ఆ జ్ఞానకర్తను సమాజం గుర్తించేలా చేయటం 'పల్లెసృజన' ప్రధాన కార్యక్రమం. జ్ఞానశోధనకై 'పల్లెసృజన' ఆధ్వర్యంలో సాగుతున్న యాత్రే 'చిన్నశోధయాత్ర'.

మరుగున పడుతున్న జ్ఞాన దేవాలయాలను (గ్రామాలను) దర్శిస్తూ జ్ఞానాన్వేషణ చేయడం, ప్రకృతితో సమన్వయంగా సహజీవనం చేస్తూ ప్రకృతినుంచి జ్ఞానాన్ని పొందే గ్రామీణులను కలవాలన్నదే 'శోధయాత్ర' ప్రధాన ఉద్దేశ్యం. ఇలాంటి శోధయాత్రలను "సృష్టి" (sristi.org) అనే అహమ్మదాబాద్ సంస్థ వారం రోజులు, సంవత్సరానికి 4 సార్లు దేశంలోని అన్ని రాష్ట్రాలలో నిర్వహిస్తుంది. పల్లెసృజన యాత్ర 3 రోజులే. అందుకే ఇది చిన్న శోధయాత్ర.

తెలుగు రాష్ట్రాలలో 'చిన్నశోధ యాత్ర'ను పల్లెసృజన నిర్వహిస్తున్నది. గత 13 సంవత్సరాలుగా 50చిన్నశోధయాత్రలు దాదాపు ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాల్లో జరిగాయి. మూడు రోజులపాటు జరిగే ఈ యాత్రలో పాల్గొనే యాత్రీకులు స్వచ్ఛందంగా ప్రకృతితో మమేకమై గ్రామీణ ప్రజలతో జ్ఞానాన్ని నేర్చుకుంటూ, పంచుకుంటూ యాత్ర సాగిస్తారు.

2011వ సంవత్సరంలో 11 మంది యాత్రికులతో ప్రారంభమైన మొదటి చిన్న శోధయాత్ర వరంగల్ జిల్లాలో జరిగింది. ఆనాటి నుండి ప్రతి సంవత్సరం నాలుగు యాత్రల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లో జరిగాయి. ఇది మూడు రోజుల యాత్ర. 50 నుండి 60 కిలోమీటర్ల దూరం వరకు ప్రతి యాత్రలో నడుస్తారు. ఈ యాత్ర ముఖ్య ఉద్దేశ్యాలు ....



- ❀ ప్రజలలోని జ్ఞానాన్ని గుర్తించి వెలికి తీయటం.
- ❀ మారుమూల అడవుల్లో వున్న జీవవైవిధ్యాన్ని దానికి జోడించివున్న జ్ఞానాన్ని సంకలనం చేయటం.
- ❀ కొండల్లో, అడవుల్లో, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజల జ్ఞానాన్ని శోధించి వెలికి తీయడం.
- ❀ ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రయోగాత్మక రైతులు, స్త్రీలు, పిల్లలు, జ్ఞానవృద్ధులను, పశు వైద్యులను సత్కరించడం.
- ❀ మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు, ప్రకృతి సమన్వయంతో ఎలా జీవిస్తారో గమనించడం.
- ❀ ఒక గ్రామంలో సేకరించిన జ్ఞానాన్ని మరో గ్రామంలో పంచడం.
- ❀ గ్రామాల్లోని క్రియాశీల వ్యక్తులను ఏకం చేయడం.

50 చిన్న శోధయాత్రలు జరిగాయంటే దానికి మూల కారణం వాలంటీర్ల ప్రమేయం. యాత్ర వివరాలను ఒక నెల ముందు వెబ్సైట్ మరియు వాట్స్ యాప్‌లు మరియు ఇ-మెయిల్ ద్వారా సమాజానికి విస్తరింప జేస్తాం. రిజిస్ట్రేషన్ చేసుకుని పలు ప్రాంతాల్లోని ప్రధానంగా దక్షిణ రాష్ట్రాల నుండి యాత్రలో పాల్గొంటారు. కొత్తవాళ్ళు, కొత్త పరిసరాలు, కొత్త ప్రజలు, కొత్త ఆలోచనలు, చర్చలు, విశ్వాసాలు, దృష్టి కోణాలు.... అన్నీ కలిసి మూడు రోజులు అద్భుత జ్ఞాన ప్రసరణ వాతావరణంలో ప్రకృతి ఒడిలో ప్రజలతో మమేకమై ఆనందంగా గడుపుతారు. దాదాపు 1500 మంది యాత్రికులకు ఈ 13 సంవత్సరాల 50 చిన్న శోధయాత్రలు మధుర అనుభవాలు. వీటిని అనుభూతి చెందడం తప్ప చెప్పటం వ్రాయటం కష్టతరం. యాత్రికుల అనుభవాలు పల్లెసృజన వెబ్సైట్‌లో చదువుకోవచ్చు

పల్లెల్లో జీవించిన మూడు రోజులు (మొత్తం 50 యాత్రల్లో 150 రోజులు) ప్రకృతిలోని సామరస్యతను, నిస్వార్థాన్ని, నిరాడంబరతను సంపూర్తిగా అనుభవిస్తాం. అది యాత్రికులను అంతర్గతంగా మారుస్తుంది, మానవత్వ విలువలకు అద్దం పడుతుంది. వారిని పట్టణాధార జీవనం నుండి మానవత్వ ఆధార జీవితానికి తెలియకుండానే మరలిస్తుంది. మనలోని శారీరక శక్తిని, మానసిక సరళత్వాన్ని వెలికి తీసి అవలంభించమని, అనుభవించమని చెప్తుంది.

ఈ మంచి మార్పులు యాత్రికులలో కొంతవరకు మానవత్వ విలువలపై ఆసక్తి కలగజేసి, గ్రామాల సమస్యలను, ప్రకృతి విలువలను ఒక వినూత్న, సత్యపరమైన దృష్టికోణంలో చూడటానికి ప్రోత్సహిస్తుంది. దీంతో ఈ యాత్రికుల దైనందిన నిర్ణయాల్లో ఒక రకమైన సత్య ఆధారిత వాస్తవాలపై చర్చలు జరుగుతాయి. వారు భవిష్యత్తులో చేసే నిర్ణయాల విశిష్ఠత పెరిగి సమాజానికి మేలు చేకూరుతుంది.

ఈ యాత్రల్లో చేపట్టిన వివిధ ప్రయత్నాలు, ప్రయోగాలు, పల్లెసృజన వాలంటీర్ల చేయూత వల్లే జరిగాయి. అందరికి పల్లెసృజన నమస్సులు.

గత 10 యాత్రల్లో కోతుల బెడద గ్రామస్తులను కష్టపెడుతుందన్న విషయం యాత్రికులకు అవగతమైంది. రాను రాను జంతువుల వల్ల గ్రామస్తుల జీవితంలో చాలా అనవసర మార్పులు వస్తున్నాయి. వ్యవస్థ, ప్రభుత్వాలు ఈ సమస్యపై ఇంకా పూర్తి శ్రద్ధ వహించి, పరిష్కారాల అన్వేషణ ప్రారంభించలేదు. గ్రామ ప్రజల గోడును విన్న యాత్రికులు చలించిపోయారు. ఏమైనా చేద్దామని ముందుకు వచ్చారు. ఎంతవరకు పల్లెసృజన వాలంటీర్లు "గ్రామాలు - జంతువుల" సామరస్యతపై పరిష్కారాలు సూచించగలరో భవిష్యత్తే నిర్ణయిస్తుంది.

దీపావళి శుభాకాంక్షలతో, అందరూ ఆనందంగా జీవితం గడపాలని ప్రార్థిస్తూ....

భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

## సమాజానికి 'పల్లెసృజన' విజ్ఞప్తి

చుట్టూ ఉన్న సమాజంలోని కష్టాలను గమనించండి. ఆ కష్టాలను సంపూర్తిగా అవగాహన చేసుకొని వాటి నివారణకై సమాజంతో చర్చలు జరపండి. సరియైన పరిష్కారాన్ని ఇన్నోవేట్ చెయ్యండి. అది ప్రజలకు అందు బాటులో ఉండేట్లుగా, అవసరానికి తగ్గట్లుగా, వైవిధ్యానికి, వాతావరణానికి తోడు చేసేట్లుగా ఉండాలి. ఇలాంటి ఇన్నోవేషన్లు ప్రజలకు చేరిస్తే ఈ దేశం నిజమైన ఆత్మ నిర్భరత ను సాధిస్తుంది. మీకు ఎటువంటి సాంకేతిక పరమైన అవసరాలు కావాలన్నా 'పల్లెసజన' ను సంప్రదించడానికి సంశయించకండి. సమస్య పరిష్కారానికి మీ ఆలోచనను తెలియజేసినా, అది కార్యరూపం దాల్చేలా చేద్దాం. ఇందుకు మీకు 'పల్లెసృజన' ఎప్పుడూ తోడుగా ఉంటుంది.

-పల్లెసృజన.



## సహజ కలుపు నివారణి
# వరి పైరుకు సంజీవని

- జానకి

మొదటి నుంచి మొక్కలు పెంచుకోవటం అంటే చాలా ఇష్టం. పెరటి తోటలు, టెర్రస్ గార్డెన్‌లు ఇలా ఇంట్లో కొన్ని రకాల మొక్కలు పెంచుకోవటం సాధారణం. కానీ అన్ని పరిస్థితులకు ఎదురొడ్డి పొలంల పంట పండించడం కత్తిమీద సాములాంటిది.



### 2015 లో పొలం కొన్నాం:

నా పేరు లావణ్య. మా వారు అరుణ్ కుమార్ గారు ఇండియన్ నేవీలో విధులు నిర్వహించేవారు. ఆ ఉద్యోగం నుంచి రిటైర్మెంట్ అయిన తర్వాత అనుకోకుండా 2015లో ఈ పొలం కొనటం జరిగింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం హేమాజీపూర్ గ్రామంలో మా వ్యవసాయ క్షేత్రం.

### వ్యవసాయంలో అనుభవం లేదు:

సేద్యంపై అవగాహన లేదు. అనుభవం కూడా తక్కువే. కానీ సేంద్రియ విధానంలో పంట పండించి, నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్న ఒకే ఒక ఆలోచనతో ముందుకెళ్లాం. నాణ్యమైన దిగుబడులతో సహజ సిద్ధంగా పంటలను ఎలా పండించాలి? దానికోసం ఏ విధమైన పద్ధతులు అవలంబించాలి? ఇలాంటి విషయాలు తెలుసుకోవటం మొదలు పెట్టాం.

### మా ప్రాంతంలో వరికి ఆస్కారం లేదన్నారు:

మా చుట్టు పక్కల రైతులు మొక్కజొన్న, జొన్న, పత్తి వంటి వర్షాధార పంటలు మాత్రమే సాగు చేస్తారు. వరికి ఎక్కువగా నీరు కావాలి. ఇక్కడ అది అసాధ్యమన్నారు. దీనిని మార్చాలన్న ఆలోచనతో ఖచ్చితంగా ప్రయత్నం చేద్దామని వరి సాగుకు పూనుకున్నాం.





### వరిలో కలుపు నివారణ సవాలు:

నేను వరి సాగును ఎంచుకున్నప్పుడు తెలుసుకున్న మొదటి విషయం వరిలో కలుపు నివారణ అసాధ్యం. ఖచ్చితంగా రసాయన మందులు వాడాల్సిందేనని. వరిలో కలుపు నివారించేందుకు మార్కెట్లో ఎన్నో రకాల రసాయన మందులు అందుబాటులో వస్తూనే ఉన్నాయి. కానీ ఎన్ని రకాల మందులు వాడినా ఫలితాలు తాత్కాలికం మాత్రమే. దీనికి తోడు కూలీల కొరత వల్ల సమయానికి కలుపు తీతలు పూర్తి కావాలంటే ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయి.



మొదట ఎకరా పొలంలో హంస వరి రకాన్ని నాటుకున్నాం. అది కూడా మా వాచ్‌మెన్ సాయంతోనే. మొదటిసారి కావటంతో దిగుబడి అంతంత మాత్రంగా వచ్చింది. కానీ మరుసటి ఏడాది మాత్రం కనుమరుగవుతున్న దేశీ వంగడాలను పండించాలి అనుకున్నాం. కుజీపటాలియా, రత్నచోడి, నవారా, నారాయణ కామిని, కర్పూర కవుని, బాస్మతి రకాలను ఆంధ్ర నుంచి తెప్పించుకున్నాం.



విత్తనం ఇంటికి చేరగానే పంట సాగు వివరాలు తెలుసుకోవటంపై దృష్టి పెట్టాను. మరుసటి రోజు నేను యూట్యూబ్‌లో గ్రామ బజార్ వారి వీడియో చూసాను. అందులో పల్లె శాస్త్రవేత్త శ్రీ గల్లా చంద్రశేఖర్ గారు తయారు చేసిన వీడ్‌జాప్ కషాయం, వరిలో కలుపు నివారణ పనితీరుపై ఆదర్శ రైతు నాగరత్నం నాయుడు గారు వివరణ ఇస్తున్నారు.

**గ్రామ బజార్ బృందానికి ఫోన్:**



అన్ని వంగడాలు ఒకే సారి కాకుండా కూజీ పటాలియా రత్నచోడ, నవారా రకాల కోసం మూడు బెల్టులుగా పొలాన్ని సిద్ధం చేసాం. వరి సాగులో నాకున్న సందేహాలన్నీ వారి ద్వారా నివృత్తి చేసుకో గలిగాను. నేరుగా వారి ఆఫీస్‌కి వెళ్ళి కలుపు నివారణ వీడ్‌జావ్ గురించి వివరంగా తెలుసుకున్నాం. వారు ఏ విధంగా అయితే వాడమని సలహా ఇచ్చారో అదే విధంగా ఉపయోగించాం.

35 రోజుల వయసున్న నారును పొలంలో నాటిన తర్వాత 22 రోజులు గడిచిపోయాయి. ఒకరోజు ఉదయాన్నే పొలం దగ్గరికి వచ్చి ఆశ్చర్యపోయాం. పొలమంతా తిరిగి ఆశ్చర్యపో యాం. పొలమంతా తిరిగి చూసి నా ఎక్కడా గరికపోసంతైనా గడ్డి కనిపించలేదు. వెంటనే దుర్గాప్రసాద్ గారికి ఫొటోలు పంపి మా ఆనందాన్ని పంచుకున్నాం.

**తుంగ, ఒడిపిలి ప్రధాన కలుపు మొక్కలు:**

మా వరి పొలంలో తుంగ, ఒడిపిలి ప్రధాన కలుపు మొక్కలు. వరి పంట పూర్తి కాలంలో, అంటే 4 నెలల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి కలుపు తీయడానికి కూలీలని పెట్టాల్సి వచ్చేది. వారికి 9 వేలు కలుపు కోసం కూలీలకు ఖర్చయ్యేది. శాశ్వ తంగా కలుపు నివారించలేక పోయినా... ఏదో ఒకలా ఒడ్డున వడేవాళ్లం. కానీ ఒక్క విషయంలో నాకు చాలా బాధేసింది. మా ఆర్థిక పరిస్థితి బాగుంది. నేను ఎంతైనా ఖర్చు చేస్తాను. కానీ సామాన్య రైతు పరిస్థితి ఏమిటి? అప్పు తెచ్చి పెట్టుబడులు వెచ్చించే వారికి ఎంత నష్టం. వారానికి కూలీలకే 10 వేలు ఖర్చు చేస్తే... మిగతా సాగు ఖర్చుల సంగతి ఏమిటి? అవన్నీ నన్ను వెంటాడిన ప్రశ్నలు.



**కషాయం కలుపు నివారించి, బలంగా మారింది:**



వీడ్‌జావ్.... ఈ కషాయం కలుపు నివారణతో పాటు ఎరువులా కూడా పని చేసింది. కేవలం 20 రోజుల్లో కలుపు లేకపోవటం, పక్క నుంచి పిలకలు రావటం, రంగు మారటం. ఇవన్నీ కూడా గతేడాది వరిలో వేము చూడ లేదు. చాలా సంతృప్తి గా అనిపించింది. భయపడుతూ వ్యవసాయంలోకి దిగాం. కానీ గ్రామ బజార్ మాకు ధైర్యాన్నిచ్చింది. కనీసం కొంత మందికైనా ఈ విషయాలు ఉపయోగ పడతాయని అనుకుంటున్నాం.

**నాట్ల పద్ధతి:**

చివరి దమ్ముకు ముందు మన వీడ్‌జావ్ కషా యాన్ని ఎకరాకు 3 లీటర్ల వెద జల్లేందుకు వీలుగా ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లుకుని దమ్ము చేసుకోవాలి. నారు వయస్సు 60 రోజులు మించకూడదు. లేత నారుకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వండి. నాటు వేసాక 10–15 రోజుల వరకు నీటిని అలాగే ఉంచాలి. ఒక మడి నుంచి మరొక మడికి నీరు వెళ్ళకుండా చూసుకోవాలి.



**గ్రోత్ ఫిట్ - బలం మందు:**



ఈ గ్రోత్ ఫిట్ పంటకు బలాన్నిచ్చి, భూసారాన్ని పెంచుతుం ది. వరిలో పైరు ఎదుగుదలతో పాటు గింజ నాణ్యతకు దోహద పడుతుంది. అన్ని రకాల వ్యవసాయ, ఉద్యానవన పంటల్లో ఈ కషాయాన్ని వాడుకోవచ్చు.

**వరి సాగుదార్లకు సూచనలు:**

ఇరు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రకాల పంటలు సాగులో ఉన్నప్పటికి.... రైతులు వరికే అధిక ప్రాధాన్యతనిస్తారు. ఈ ఏడాది 66 లక్షల ఎకరాల్లో వరి సాగువుతుందని అంచనా. గతేడాదితో పోల్చుకుంటే ఈసారి లక్ష ఎకరాల విస్తీర్ణం పెరగనుంది. అయితే సాగుదార్లు కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం చాలా అవసరం.

ఇటీవలి కాలంలో ఊహించని వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు, ఆలస్యంగా కురిసే వర్షాలు, చీడపీడలు, కూలీల సమస్య వరిలో దిగుబడులమీద ప్రభావం చూపుతోంది. కాబట్టి రైతులు సాగు పట్ల అప్రమత్తంగా ఉండాలి. వరి నాణ్యమైన దిగుబడులు సాధించాలంటే సరైన పోషక పదార్థాలు అందించాలి. దానికోసం మన సాగు చేసే నేల రకం, ఏ పోషకాలు సమృద్ధిగా ఉన్నాయి? వంటి విషయాలపై భూసార పరీక్షలు చేయించాలి.

భూసార పరిరక్షణకు, సుస్థిర దిగుబడుల కోసం రసాయన ఎరువులతో పాటు అందుబాటులో ఉన్న ఏదో ఒక సేంద్రియ ఎరువుగానీ జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులుగానీ వాడుకోవటం మంచిది. రైతులు ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. భూమిలో ఏ పోషకం ఎంత మోతాదులో ఉందో తెలుసుకోకుండా రసాయన ఎరువుల జోలికి వెళ్లవద్దు. సాధ్యమైనంత వరకు రసాయనాలు తగ్గించడానికి ప్రాధాన్యతనివ్వటం ఉత్తమం.

**సదా రైతు సేవలో....**

రైతులు పంట సమస్యల వివరాలు (ఫొటోలతో సహా) మాకు పంపితే మొక్కలు దెబ్బతిన్న శాతాన్ని బట్టి మోతాదు నిర్ణయిస్తాము. మధ్యవర్తులెవరూ లేకుండా ఆర్టీసీ కార్గో ద్వారా నేరుగా రైతు వద్దకే మా ఉత్పత్తులను చేరుస్తాము.

**సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :** 94912 78836, 833 1800 100. అలాగే మీ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి 70138 33588 కి హాయ్ అని మెసేజ్ చేయండి.

శ్రీ జాగర్లమూడి దుర్గా ప్రసాద్ – 94912 78836

# శత ప్రతుల 'పల్లెసృజన'




అప్పుడే వంద 'పల్లెసృజన' పత్రికలు ప్రచురించామా? వెనక్కి తిరిగి చూస్తే ఆశ్చర్యంగా ఉంది. మనమే ఇంత పని చేయగలిగామా అన్న అనుమానం కూడా కలుగుతుంది.

2005 నవంబర్ 20న ప్రారంభమైన 'పల్లెసృజన' సంస్థ మెల్లి మెల్లిగా గ్రామీణ ఇన్నోవేటర్లను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వెతకటం ప్రారంభించింది. నాకు తోడు మార్గదర్శి మా బావగారు కీ.శే. కశోర్జుల లోకేందర్ రావు గారు, కాలేజీ మిత్రుడు, చుట్టం కీ.శే. చంద్రకాంత్ శర్మ గారు, అప్పటికి నేను ఆర్మీలో రిటైర్ అయ్యి ఒక ప్రైవేటు ఐ.టి. కంపెనీలో వైస్ ప్రసిడెంట్‌గా హైదరాబాద్ లో పని చేస్తున్నాను. 2006 మార్చికల్లా వన్నెండు ఇన్నోవేషన్లు వెతికి వాటిని గ్రంథస్తం చేయగలిగాము. వాటిని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌కు పంపి రిజిష్టరు చేసాము. అయితే సేకరించిన ఈ పల్లె జ్ఞానాన్ని పది మందికి చేర్చకపోతే మేము చేసే కార్యం అసంపూర్తిగా ఉంటుంది అనిపించింది. చర్చల తర్వాత ఒక పత్రికను ప్రారంభించాలని నిర్ణయించుకున్నాం. ప్రొఫెసర్ అనిల్ కె. గుప్తా గారి సలహాతో 'హనీబీ ఎపి' అన్న పేరుతో మే, 2006లో ఎన్ఐఆర్‌డి ఆడిటో రియంలో ఈ పత్రికను ఆవిష్కరించాం. శ్రీ 'పుష్ప భార్గవ గారు (సిసి ఎంబి మాజీ వ్యవస్థావక డైరెక్టర్) ఆవిష్కరించగా, ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారు ఆశీర్వాదాలు తెలిపారు. అయితే ఈ సభకు ఎవరిని ఆహ్వానిం చాలో కూడా నాకు తెలియదు. ఎపి లోని ఎన్‌జిఓ ల లిస్టులో అందరికీ ఇ–మెయిల్ లో ఆహ్వానం పంపితే కేవలం పది మంది హాజరయ్యారు. నేను తెలుగు సమాజానికి అనామకుడ్ని అన్న విషయం పూర్తిగా అవగతమైంది. అన్నట్లు మూడవ సంచిక నుండి పత్రికను "పల్లెసృజన" గా నామకరణం చేశాం. అలా మొదలైంది 'పల్లెసృజన' పత్రిక ప్రయణం. సంవత్సరానికి నాలుగు పత్రికలు – త్రైమాసికంగా మొదలు పెట్టాం. పత్రిక రిజిస్ట్రేషనుకై ఢిల్లీలో అప్లయ్ చేశాము.

35 సంవత్సరాలు భారత సైన్యంలో గడిపి,రిటైరై నవంబర్ 2005లో హైదరాబాదుకు వచ్చి స్థిరపడ్డ నాకు ఒక పత్రిక నడపాలన్న ధైర్యం ఎలా వచ్చిందో సరిగ్గా నాకే తెలియదు. ఇన్నేళ్ళు తెలుగు వ్రాయటం అలవాటు లేకపోవటం వల్ల తెలుగు మరచిపోయినట్లు, వ్రాయడం ఇబ్బందిగా ఉండేది. అయినా పత్రికా ప్రచురణకు ముందుకు వెళ్ళ టానికి ముఖ్య కారణం పల్లె వీరరాఘవ రెడ్డి. మా బావగారికి రాఘవ అప్పటికే పరిచయం. ప్రింటరుగా, డిజైనర్‌గా రాఘవ చిక్కడపల్లిలోని తన నివాసం నుండి అందరికీ ఎంతో శ్రద్ధగా, చక్కటి క్వాలిటీతో అన్ని ప్రింటింగ్ పనులు చేస్తాడన్న మంచి పేరు సంపాదించుకున్నాడు రాఘవ. మా బావగారి సలహాతో రాఘవతో చర్చించి, మార్చి 2006లో పత్రికా నిర్వహణకై నిర్ణయాన్ని తీసుకు న్నాము. నాకు పూర్తి ధైర్యాన్ని, ప్రింటింగ్ మరియు పబ్లిషింగ్ లోని వివరాలను నేర్పింది, ముందుకు నడిపించింది రాఘవరెడ్డియే. 2006 నుండి ఇప్పటి దాకా మా జంట అలవలేదు, విడిపోలేదు, గొడవ లేదు,



నిరంతరం పత్రిక ఎలా నడపాలి అన్న తపన మా ఇద్దరి మధ్య ఉన్న జరగని, తరగని బంధం. రాఘవ నా జీవితంలోకి రాకపోతే బహుశ "పల్లెసృజన" పత్రిక ఆవిర్భావించేది కాదేమో!

ఏప్రిల్ 2006లో నేను భారత్ డైనమిక్ లిమిటెడ్‌లో డైరెక్టర్ గా చేరాను. పల్లెసృజనకు సమయం తక్కువగా లభించేది. అయినా నేను రాఘవ ఎప్పుడూ తడబడలేదు. కొత్త ఇన్నోవేటర్లను వెతకడం నా పని అయితే, వారి కథలను వ్రాయడం రాఘవ పని. రాఘవ ఇంట్లో ఆయన శ్రీమతి ప్రభావతి మాపై ప్రేమతో ఇచ్చే కాఫీలు త్రాగుతూ, రాత్రి పది గంటల వరకు త్రైమాసిక పత్రికను ఎడిట్ చేసేవాళ్ళం. మొదట కొన్ని పత్రికలకు డా. లోకేందర్ రావు గారు సంపాదకీయం వ్రాశారు. నేను ఆ తర్వాత ఆంగ్లంలో వ్రాస్తే నా సంపాదకీయాలను రాఘవ తెలుగులోకి అనువదించేవాడు. ఏదియేమైనా ఒక్క పత్రిక కూడా ఆగకుండా కొత్త కొత్త పల్లె ఇన్నోవేషన్లను, ఇతర రాష్ట్రాల ఇన్నోవేషన్లను తెలుగు ప్రజలకు అవసరమైనవి సేకరించి ప్రచురించేవాళ్ళం. మా అదృష్టం కొద్ది 2010 లో శ్రీ జమ్మలమడక శశిమోసన్ గారు పరిచయం అయ్యారు. ఆయనకు తెలుగు సాహిత్యంలో మంచి పట్టు ఉంది. నాటకాలు వ్రాసి 'నంది' పురస్కారాలు కూడా పొందారు. కొన్ని సంభాషణల తర్వాత పత్రిక సంపాదకీయ బాధ్యతను చేపట్టడానికి ఆయన సుముఖులయ్యారు. అప్పటినుండి నా బాధ్యత తగ్గినా ముగ్గురం కలిసి ముందుకు సాగాం. 2011లో 'పల్లెసృజన'ను ద్వైమాసిక పత్రికగా మార్చాం. దాంతో రెండు నెలల్లో 2-3 కొత్త ఇన్నోవేషన్లను వెతకడం ఒక గమ్యంగా పెట్టుకుని ముందుకు సాగాం. వంద సంచికలంటే కనీసం 300 ఇన్నోవేటర్లను పల్లెసృజన పత్రిక ద్వారా తెలుగు ప్రజలకు పరిచయం చేయగలిగాం. ఇన్నోవేటర్లకు



అతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ అవార్డులు వచ్చిన ఆనందాన్ని పత్రిక ద్వారా తెలుగు సమాజంతో పంచుకున్నాం. నిజంగా చెప్పాలంటే పల్లెసృజన కార్యక్రమాలు తెలుగు ప్రజలకు విస్తారంగా తెలిశాయంటే ముఖ్య కారణం పల్లెసృజన పత్రికే.

పత్రిక ప్రారంభానికి ముందు కొన్ని నిర్ణయాలు చేశాం. ప్రథమంగా అడ్వర్‌టైజ్ మెంట్‌లు, స్పాన్సర్‌షిప్‌లు ఒప్పుకోకూడదన్న అంగీకారానికి వచ్చాం. రెండవది పత్రికా నిర్వహణ వాలంటీర్లతో చేయాలని, జీతాలు, ఉద్యోగులు ఉండకూడదని, కనీస ఖర్చులతో (ప్రింటింగ్ కు మాత్రమే) పత్రికను ముందకు తీసుకు వెళ్ళాలని నిశ్చయించుకున్నాం. దీనికి ప్రేరణ మహాత్మాగాంధీ గారి "భావ స్వాతంత్ర్యం కావాలంటే ఆర్థిక స్వాతంత్ర్యం" ఆదేశాన్ని గత 18 సంవత్సరాలుగా, వంద సంచికలకు సంపూర్తిగా పాటిస్తూ ఈ మైలు రాయికి చేరుకున్నామన్న ఆనందం మా సంపాదక బృందానికి ఎంత గానో ఉంది. ప్రతి సంచిక ప్రింటింగ్‌కు సిద్ధం కావడానికి వాలంటీర్లే కారణం. ఈ పాటికి వందల వాలంటీర్ల సహాయంతో ఈ ప్రయాణం సాగింది. మా ప్రథమ వాలంటీర్ 'జ్యోతిరెడ్డి' నాడు గ్రూప్ పరీక్షలక సిద్ధమవుతూ మొదటి 2-3 పత్రికలకు పూర్తిగా తోడ్పడింది. ఆమే మా 'పల్లెసృజన' పత్రికకు మొదటి వాలంటీరు. కిషన్ పవార్ అనే అతను సంగారెడ్డి లో ఉపాధ్యాయుడిగా ఉంటూ పత్రిక ప్రూఫ్ రీడింగ్‌కి రాఘవరెడ్డి ఇంట్లో ఒక రోజంతా గడిపి సహాయం చేసేవాడు. అలా ఎందరో మహానుభావులు వయస్సుతో నిమిత్తం లేకుండా స్వచ్ఛందంగా, ఆనందంతో ఈ సమాజ సేవలో పాల్గొన్నారు. వీరందరికి ముఖతా నమస్కారాలు తెలపడం తప్ప పల్లెసృజన వీరికి ఏమీ చెయ్యలేదు. అలా అనుకున్నాం .... అలాగే జరిగింది. 2005 నుండి నా శ్రీమతి అరుణా గణేశం సంపూర్తి సహకారం, సేవానిరతి నన్ను ముందుకు నడిపిం చింది. నేను బిడిఎల్ వ్యవహారాల్లో నిమగ్నమైతే, పత్రికను, పల్లెసృజనను ముందుకు నడిపించింది వాలంటీరు అరుణ. వీరందరి ఉన్నత మనస్తత్వానికి, సేవా భావానికి, వారి మంచి తనానికి వేము ఎలా కృతజ్ఞతలు తెలుపుకుంటాం! అందరం కలసి ఆనందంగా ఈ సత్కార్యాన్ని ముందుకు తీసుకు వెళ్ళామన్న తృప్తి మాత్రం అనంతంగా ఉంది.

నేనేమో రక్షణ శాఖ కంపెనీ డైరెక్టర్ని, రాఘవ ప్రింటర్‌గా కొనసాగుతున్నాడు. డా. లోకేందర్ గారు అరవై దాటిని విశ్రాంత విద్యాధికారి. మరి మేము పల్లెసృజన పత్రికను ఎలా విస్తరింపజేయాలి? దీని పాఠకులు ఎవరు? ఎక్కడున్నారు? వారికి ఎలా చేరవేయాలి? ఎంత ధర ఉండాలి? ఎలా పంపిణీ చేయాలి? మాకు ఎవరు తెలుసు? మేము ఎవరికి తెలుసు? ప్రభుతం ఏమైనా చేయగలదా? పెట్టుబడి లేని సేవా



## "పల్లెసృజన"కు 'కీ.శే. ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్' గారి ఆశీర్వాదం

అక్టోబర్ - డిశంబర్ 2007 సంచికలో ప్రచురించిన నాటి ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా "పల్లెసృజన"ను ఆశీర్వదిస్తూ వ్రాసిన ఉత్తరం.

ఎడిటర్ గారికి,

"పల్లెసీమలు దేశ ప్రగతికి పట్టుకొమ్మలు" అని పెద్దలు చెప్పిన విషయాన్ని నిజం చేస్తూ, తెరచాటున అభివృద్ధి చెందుతున్న పల్లె ప్రతిభను వెలుగులోకి తీసుకొని వస్తున్న 'పల్లెసృజన' త్రైమాసిక పత్రిక (నాడు త్రైమాసిక పత్రిక - నేడు ద్వైమాసిక పత్రిక) పత్రికా రంగంలో ఒక నూతన ఒరవడి సృష్టిస్తోంది.

వివిధ దేశీయ, విదేశీయ ప్రసార సాధనాలు ఆధునిక సమాచారాన్ని అందివ్వడంలో పోటీ పడుతున్న ఈ తరుణంలో వాటికి ధీటుగా, వారికి కూడా తెలియని, అంతు చిక్కని పరిశోధనల సమాచారాన్ని సామాన్య పాఠకులకు అర్థమయ్యే రీతిలో, సులభ శైలిలో, నిత్య దైనందిన జీవితంలోని విద్యా, వైద్య, వైజ్ఞానిక విషయాలను ఈ పత్రిక ద్వారా తెలియ జేయడం చాలా సంతోషం.

పత్రికా రంగంలో చిరు ప్రాయంలో ఉన్న పుత్రిక, స్థాయిని మించిన సమాచారాన్ని అందించడంలో మీరు చేస్తున్న నిస్వార్థ కృషికి 'పల్లెసృజన' పత్రికా సంపాదకీయ వర్గానికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేయుచున్నాను. ఈ పత్రిక దినదిన ప్రవర్ధమానమై, అందరికీ అందుబాటులో, అనువైన పరిస్థితులను కల్పించ గలదని ఆశిస్తున్నాను. **-డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్.**

కీ.శే. హరిశ్చంద్ర ప్రసాద్ గారు మాకీ ఉత్తరం వ్రాసే సమయానికి పల్లెసృజన కేవలం 5 సంచికలు మాత్రమే ప్రచురించింది. అప్పుడే వారు 'పల్లెసృజన' గమ్యాన్ని, దిశను నిర్ధారించారు. ఆయన ఆశీర్వాదాలతో నిర్ధారించిన దిశలో పల్లెసృజన 18 యేళ్ళ ప్రయాణం ఎంతో ఆనందకరంగా ఉంది. **-ఎడిటర్.**

భావంతో చేయాలన్న మా నిర్ణయం ఎలా ముందుకు తీసుకెళ్తుంది? ఇలా అన్నీ ప్రశ్నలే. నేను, రాఘవ గంటలకొద్ది, రోజులకొద్ది మంథన చేసే వాళ్ళం. జవాబులు దొరికేవి కావు. ఈ పద్ధతిలో పత్రిక నడిపిన వాళ్ళ ఉదాహరణ లేదు అందుకే మా మార్గాన్ని మేమే తయారు చేసుకుంటూ ముందుకు వెళ్ళాం. ''గాలిలో ఎగురుతూ విమానాన్ని తయారు చేసుకోవడం అంటే ఇదేనేమో!''

ప్రథమ పత్రిక వెయ్యి కాపీలు ప్రచురించాం. ఎవరికి పంపాలో నిర్ణయం కాలేదు. అందరికి ఉచితంగా పంపాలని నిశ్చయించుకున్నాం. పుస్తకంపై సభ్యత్వ వివరాలు, బ్యాంకు అకౌంటు ప్రచురించాం. ఎన్‌జిఓల లిస్టు, హైదరాబాద్ లోని ప్రముఖులు, కొన్ని ప్రభుత్వ శాఖల సెక్రెటరీలు, ప్రధాన గ్రంథాలయాలు, గ్రామాల్లో తెలిసిన వాళ్ళకి వెయ్యి పత్రికలు పంపిణీ చేశాం. వేచి చూశాం. రెండవ సంచిక అలాగే మరి కొంతమంది ఎన్‌జిఓలకి, అందరు కలెక్టర్లకి, జిల్లా గ్రంథాలయాలకు ఉచితంగా పంపాం. మూడవ సంచిక వరకల్లా సభ్యత్వాలు రావడం ప్రారంభమైంది. పోస్టులో పంపడం కొంచెం అలవాటయ్యింది. నేను, అరుణ దాదాపు 1500 దాకా అడ్రసులు చేతితో రాసి, స్టాంపులు అంటించి, మా డ్రైవరు రాజ్ కుమార్‌తో పోస్టు చేయించేవాళ్ళం. 2007లో ప్రారంభంలో ప్లానింగ్ సెక్రటరీ గారిని కలిసి పల్లెసృజన కార్యక్రమాల గురించి వివరించాను. ఆయన శ్రద్ధగా విని, ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని మండల సమితిలకై (1200 ప్రతులు) రూ. 25 కాపీ చొప్పున సభ్యత్వం ఇచ్చారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు 2013 నుండి 500 ప్రతులకై సహాయం అందించారు. అలాగే సింగరేణి కాలరీస్ ఛైర్మన్ ఖాజా మొయినుద్దీన్ గారు 300 కాపీలకు సభ్యత్వం ఇవ్వటానికి ఒప్పుకున్నారు. సింగరేణి సభ్యత్వం ఇప్పటికీ కొనసాగుతునే ఉంది. 2013లో డాక్టరు దంపతులు విజయవాడ వాసులు సుధా - నాగేశ్వర రావు గార్లు పల్లెసృజన కార్యాల యానికి వచ్చి మేము పల్లె జ్ఞానాన్ని వెతకటంలో, వ్యాప్తి చేయడంలో చేస్తున్న కృషిని అభినందించి, వారి జిల్లా కృష్ణా లోని 942 గ్రామాలకు ఒక సంవత్సరం సభ్యత్వం కట్టారు. ''మీ ఊరికి పల్లె జ్ఞానాన్ని కనెక్ట్ చేయండి'' అన్న నినాదంతో చాలామంది ఎన్ఆర్ఐ (నాన్ రెసిడెన్స్ ఇండి యన్స్) లు/ ఎన్ఆర్‌వి (నాన్ రెసిడెన్స్ విలేజర్స్) లు వారి గ్రామాలకు పత్రిక చేరడానికి సభ్యత్వాలు తీసుకున్నారు. ఇలా మెల్లిగా 5 వేల వరకు సభ్యత్వాలు పెరిగాయి. కొన్ని కొనసాగలేదు. నాబార్డు అన్ని ఎఫ్‌పిఓలను చందాదారులను చేసారు. వందేమాతరం ఫౌండేషన్, కెనరా బ్యాంకు, వలస భారతీయులు 5 నుంచి 50 వరకు సభ్యత్వాలు చేశారు. కొన్ని కాలేజీలు 50 వరకు పత్రికలకు మూల్యం చెల్లించారు. సమాజమంతా ముందుకు వచ్చి,





'పల్లెసృజన' పత్రికను కాపాడింది, కాపాడుకుంది. ఈ సహజీవన బంధం ఎంతో ఆనంద దాయకంగా, సత్సంబంధాలతో ఎంతో ప్రేమగా సాగింది. పోస్ట్ మాస్టర్‌లు, పోస్ట్‌మేన్ లు కూడా మాతో సంప్రదించి, అడ్రసు వివరాలు కనుక్కొని మరీ పాఠకులకు అందజేసేవారు.

'పల్లెసృజన' సాధించింది ఏమిటి? మా దృష్టిలో ప్రథమంగా సమానాంతర పల్లెజ్ఞాన ప్రసరణ. రైతు నుండి రైతుకి, పల్లె నుండి పల్లెకు వారి జ్ఞానాన్ని వారి భాషలో చేరవేయటమే కాకుండా ఫోన్ నెంబర్లు ప్రచురించటంతో సమానాంతర సంభాషణలు, చర్చలు, ఇన్నోవేటర్, రైతులతో మిగతా రైతులు ప్రారంభించారు. ఈ సమానాంతర సంభాషణ గ్రామ స్థాయిలో పత్రిక ద్వారా ప్రారంభించడం ఇదే ప్రథమమేమో.

రెండవది. ఇన్నోవేటర్లను వారి గ్రామాలకు ఆహ్వానించి, సరియైన ఆతిథ్యాన్నిచ్చి, గ్రామ ప్రజలు వారి సమస్యలకు పరిష్కారాలు తయారు చేయించుకుని లాభం పొందారు. పరిశోధన గ్రామానికి సమీపంలో ఉంటే సమస్యలు త్వరితంగా, సంపూర్తిగా పరిష్కారం అవుతాయన్న పల్లెసృజన సిద్ధాంతానికి ఇదొక మంచి తార్కాణం.

మూడవది. రైతులు వారి సమస్యలను పరిష్కరించుకోగలరన్న నమ్మకం పల్లెసృజన పత్రిక కథల ద్వారా గ్రామ ప్రజలకు అవగతమైంది. వారిని పరిష్కారాలకై ప్రోత్సహించింది. ఎన్ని కొత్త ఇన్నోవేషన్లు ఈ విధంగా వచ్చాయో, ఎన్ని ప్రయత్నాలు జరిగాయో .... వాటి లెక్కే లేదు. ఇది జరిగిందన్న మాట మాత్రం వాస్తవం.

నాల్గవది. సామాన్య రైతులు, గ్రామాల్లోని మెకానిక్‌ల ఫొటోలు పత్రికపై ముఖచిత్రంగా ప్రచురించటం 'పల్లెసృజన' ప్రారంభించింది. సామాన్యుల ముఖచిత్రాలు పత్రికలో ప్రచురించగానే వారంతా 'ఇన్నోవేటర్లు' అయ్యారు. వారికి గ్రామాల్లో, జిల్లాలో గుర్తింపు వచ్చింది. వారిని అందరూ ''ఇన్నోవేటరు'' అనటం ప్రారంభించారు. ఒక నూతన పై ఎత్తుపై వారు చేసిన జ్ఞానపరమైన ఇన్నోవేషన్ల ఆధారంగా వారిని సమాజం కూర్చోబెట్టింది. ఈ జ్ఞానపరమైన స్థాయిని సమాజం ఏ వివక్ష లేకుండా ఇన్నోవేటర్లని గౌరవించటం ప్రారంభించింది. ఎప్పుడైతే పల్లెసృజలు చేసిన ఇన్నోవేషన్లకు జాతీయ గుర్తింపులు, పేటెంట్లు, పద్మశ్రీలు వచ్చిన తర్వాత ఇన్నోవేటర్లకు సమాజ గౌరవటం ఇనుమడించింది.

ఐదవది. స్కూలు పిల్లలు పల్లెసృజన పత్రికలో ప్రచురించిన సామాన్యుల సమస్యా పరిష్కారాలను చదివి, అబ్బురపడి, అనుకరించడం ప్రారంభించారు. వారు కూడా ఇన్నోవేషన్లు చేసి,

జాతీయ బహుమతులు కైవసం చేసుకున్న ఉదాహరణలు కూడా తెలుగు రాష్ట్రాల్లో చాలా ఉన్నాయి. వారి కథలను కూడా పల్లెసృజన పత్రికలో ప్రచురించాం.

ఆరవది – ఇన్నోవేషన్ల విస్తరణకు పత్రిక ఎన్నో విధాలుగా తోడ్పడింది. ఇతర రాష్ట్రాల్లోని తెలుగు వారికి అవసరమైన ఇన్నోవేషన్లతో సంధానం చెయ్యటం ద్వారా కొంత లాభం తెలుగు రైతులు పొందారని భావిస్తున్నాం.

ఈ ప్రయాణంలో మాకు దక్కిన అరుదైన ఘటన. మొదటి అయిదు సంచికల తదుపరి కీ.శే. ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ గారి నుండి నాకు ఒక ఉత్తరం వచ్చింది. వారు నాకు వ్యక్తిగతంగా తెలియదు. కాని రాష్ట్రమంతా తెలిసిన వ్యక్తి చేతితో వ్రాసిన ఆ ఉత్తరాన్ని శ్రద్ధతో చదివి నివ్వెరపోయాము. అది ఉత్తరం కాదు, మాకు జ్ఞానాన్ని, మార్గదర్శకా లను, ఆశీర్వాదాలను ఉదారంగా చేరవేసింది. హరిశ్చంద్ర ప్రసాద్ గారి ఆ లేఖ ఇక్కడ ప్రచురిస్తున్నాము. ఆయన పల్లెసృజనను చూసిన విధానం "**వివిధ దేశీయ, విదేశీయ ప్రసార సాధనాలు ఆధునిక సమాచారాన్ని అందివ్వడంలో పోటీ పడుతున్న ఈ తరుణంలో వాటికి ధీటుగా, వారికి కూడా తెలియని, అంతు చిక్కని పరిశోధనల సమాచారాన్ని సామాన్య పాఠకులకు అర్థమయ్యే రీతిలో, సులభ శైలిలో, నిత్య దైనందిన జీవితంలోని విద్యా, వైద్య, వైజ్ఞానిక విషయాలను ఈ పత్రిక ద్వారా తెలియ జేయడం చాలా సంతోషం.**" మేము ఇంత విశేషమైన కార్యం చేస్తున్నామన్న విషయం ఆయన ప్రస్ఫుటంగా విదితం చేశారు. చివరి వాక్యంలో ఆయన ఆశీర్వాదాలు మాకు పూర్తిగా లభించాయి కాబట్టే "శత సంచిక" వరకు చేరుకోగలిగాము.

జ్ఞాన ప్రసరణ ధ్యేయంగా పయనం చేస్తున్న 'పల్లెసృజన' పత్రికకు వంద సంచికల సంబరం – పాఠకుల, రైతుల సలహాలు, వారి ప్రోత్సాహం, సమాజ మార్గదర్శకత్వం, వ్యవస్థ సహకారాలను పండగ చేసుకోవడమే. ప్రతి గ్రామానికి పల్లెసృజన చేరాలన్న కోరిక – ఇవి తీరితే సంపాదక వర్గం, వాలంటీర్ల కృషి సార్థకమైందని మనసారా విశ్వసిస్తాం. ఇది మన పత్రిక, మన పల్లెసృజన, దీని భూత భవిష్యత్తు మనవే. నడిపించాల్సిన వాళ్ళము మనమే. ఇన్నోవేటర్లను వెతికే వాళ్ళము మనమే. చిరునవ్వుతో, చేతిలో చేయితో అందరం కలిసి ముందుకు అడుగు వేద్దాం. పల్లె జ్ఞాన యాత్రను సాగిద్దాం. ●

# 'పల్లెసృజన ఇన్నోవేషన్లను' ఆదరించిన "గద్వాల రైతు సదస్సు"

అక్టోబర్ 26, 2024 న తెలంగాణ రాష్ట్రం లోని 'గద్వాల' జిల్లా కేంద్రంలో స్థానిక శాసన సభ్యుడు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో 'గద్వాల రైతు సదస్సు' ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సదస్సుకు శాసన సభ్యులు, సదస్సు నిర్వాహకులు "పల్లెసృజన" ద్వారా వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్ల ప్రదర్శన ఏర్పాటు చేయమని కోరటం జరిగింది. వారి కోరిక మేరకు పల్లెసృజన పత్రిక సంపాదకవర్గ సభ్యుడు వీరరాఘవ రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి క్రియేటివ్ మైండ్స్ తరుపున సుభాష్ చందర్, పల్లెసృజన కార్యాలయం నుండి కొన్ని ఇన్నోవేషన్లను తీసుకు రాగా, వారి వారి ప్రాంతాల నుండి నేరుగా 20 మంది ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లతో పాటు హాజరు కావటం జరిగింది. మొత్తంగా ఈ ప్రదర్శనలో 50 దాకా ఇన్నోవేషన్లను ప్రదర్శించడం జరిగింది.

ఇన్నోవేషన్ల ప్రదర్శనను సందర్శించిన శాసన సభ్యులు కృష్ణ మోహన్ రెడ్డి, కలెక్టర్ సంతోష్ మరియు ఇతర అధికారులు ప్రతి ఇన్నోవేషన్ దగ్గర సమయం వెచ్చించి, వాటిని తయారు చేసిన విధానం, శ్రమను, పెట్టు బడిని తగ్గించే వివరాలను అడిగి తెలుసుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రదర్శన సమయంలో మన ఇన్నోవేటర్ చిడిపి నాగభూషణం తయారు చేసిన సులభంగా బిస్కట్లు తయారు చేసేందుకు చేసే గ్యాస్ ఓవెన్‌ను వెంటనే తమ కలెక్టరు కార్యాలయం లోని మహిళా ఫుడ్ కోర్ట్‌కు ఒకటి తెప్పించమని అధికారులకు సూచించారు కలెక్టర్. ఈ సదస్సులో పాల్గొన్న రైతులు నాగభూషణం వినూత్న పద్ధతిలో తయారు చేసిన గ్యాస్ ఓవెన్ బిస్కట్లను దాదాపు రూ. 5 వేల వరకు కొనుగోలు చేసి ఆస్వాదించారు.

మోధా శివకుమార్ చేసిన 'పెడల్ లిఫ్టింగ్' యంత్రాన్ని గురించి ఈ రైతు సదస్సులో కాకుండా దీని గురించి ప్రత్యేకంగా ఒక సమావేశం ఏర్పాటు చేసి, దీన్ని గద్వాల చేనేత కారులకు తప్పక పరిచయం చేద్దామని ప్రదర్శన నిర్వాహకుడు వీరరాఘవ రెడ్డితో కలెక్టరు మరియు ఎమ్మెల్యే గార్లు చెప్పడం జరిగింది.

ఈ ప్రదర్శనలో నల్గొండ జిల్లా వాసి ప్రముఖ సృజనాత్మక రైతు లోకసాని పద్మారెడ్డి గారు పఠాన్ సైదా తయారు చేసిన విండ్‌మిల్ చాలా బాగుందని, దీన్ని తప్పక తమ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేయిస్తానని, ఒకసారి తమ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి, ఎక్కడ ఏర్పాటు చేస్తే బావుంటుందో చూడమని ఇన్నోవేటర్ పఠాన్ సైదాను కోరటం జరిగింది.

పూణేకు చెందిన ఇన్నోవేటర్ నిహాల్ అత్తర్ తయారు చేసిన 4 వ్యవసాయ చేతి పరికరాలను రైతులు ఎంతో బావున్నాయని వాటిని కొనుగోలు చెయ్యటం జరిగింది. కొప్పుల అశోక్ తయారు చేసిన 3 రకాల వీడర్లు ఒకటి నడుస్తూ పని చేసేది, ఒకటి కూర్చుని నడిపే మూడు చక్రాల వీడర్ మరియు నాలుగు చక్రాల వీడర్‌లను, వ్యవసా యంలో దాదాపు అన్ని రకాల పనులను చేసే పరికరాలను ఎంతో శ్రద్ధ తో తిలకించారు, అశోక్‌కు ఈ ప్రదర్శన ద్వారా కనీసం 5–6 వీడర్ల ఆర్డర్లు వచ్చే అవకాశం ఉంది. వెంకట కృష్ణ తయారు చేసిన మూలికా పురుగు మందుల పట్ల రైతులు ఉత్సుకత చూపి కొనుగోలు చేశారు.

నారాయణ్‌ఖేడ్ కు చెందిన ఇన్నోవేటర్ దీపక్ రెడ్డి తయారు చేసిన పొలంలో రాళ్ళు ఏరివేసే యంత్రాన్ని కలెక్టర్, శాసన సభ్యుడు, రైతు సోదరులు ఎంతో ఉత్సుకతతో దాని పనితనాన్ని చూశారు. పొలాల్లోని రాళ్ళను ఏరివేసేందుకు ఒక మంచి యంత్రం తయారు చేసినందుకు అతన్ని అందరూ అభినందించారు. వారికి గద్వాల నుండి కనీసం 2 యంత్రాలు కొనుగోలు చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దాని కొరకు ఇప్పటికే చర్చలు మొదలు పెట్టారు.

మొత్తానికి 'పల్లెసృజన' ఇన్నోవేషన్ల ద్వారా గద్వాలలో ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు పెద్ద ఆకర్షణ అని చెప్పుకోక తప్పదు. ఆ తర్వాత జరిగిన సదస్సు మీటింగులో కూడా కలెక్టర్ మరియు శాసన సభ్యులు 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను రైతులందరూ వినియోగిం చుకొని తమ పెట్టుబడి ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవటంతో పాటు మంచి దిగుబడులు సాధిస్తారని తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రైతు సదస్సు ఏర్పాటు పట్ల పాల్గొన్న ప్రతి ఇన్నోవేటర్ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

గద్వాల శాసన సభ్యులు లాగా రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులు తమతమ ప్రాంతాలలో "రైతు ఇన్నోవేషన్ల ప్రదర్శన"ను నిర్వహిస్తూ తెలుగు రైతాంగానికి బహుళ ప్రయోజనాలు తప్పక జరుగుతాయని 'పల్లెసృజన' విశ్వసిస్తోంది. ●



# 'జి-20' 'సి-20' 'లైఫ్' అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశ సమ్మతులు



**లైఫ్ (LiFE)**
**పర్యావరణ రక్షణకై జీవన విధానం**
**(Lifestyle for Environment)**

పర్యావరణంపై మానవుల ప్రభావం తగ్గించడానికై అంతర్జాతీయంగా వివిధ స్థాయిలలో అనేక సంస్థలు, కూటములు పని చేస్తున్నాయి. తమతమ పరిధులలో పని చేసే ఈ వ్యవస్థలు వాతావరణ పాలనకి శాస్త్రీయ, ఆర్థిక, రాజకీయ రూపాలలో సహాయం అందిస్తాయి. ఈ నియంత్రణ వ్యవస్థల ఏర్పాటుకి, ఖర్చు చేసిన వనరులకి, శ్రమకి తగ్గ ఫలితాలు అందటం లేదు. కారణం తీసుకున్న నిర్ణయాలు, కల్పించుకున్న ఒప్పందాలు సరియైన పద్ధతిలో అమలు కావటం లేదు.

(గత సంచిక తరువాయి)

**'లైఫ్' ద్వారా సుస్థిరతను సాధించే గృహావసరాల వితరణ:** భారత దేశం లోని ముంబై నగరంలో 32 వేల మంది సభ్యులతో 'ముంబై గ్రాహక్ పంచాయత్' పేరిట ఒక వినియోగ దారుల సంఘం నిర్వహించ బడుతోంది. 3,500 మంది స్వచ్ఛంద కార్యకర్తలు దీనిని నిర్వహిస్తున్నారు. ప్రతి నెల సహకార పద్ధతిలో వీరు గృహావసరాలకు కావలసిన సామాన్లు కొనుగోలు చేసి, వికేంద్రీకరణ పద్ధతిలో సభ్యుల ఇంటి దగ్గరికి అందజేస్తారు.

సహకార పద్ధతిలో కొనటం వికేంద్రీకరణ పంపకం వలన శక్తి ఉపయోగం, ఇంధనాల ఆదా అవుతుంది. అలాగే ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని చాలావరకు తగ్గించి, పర్యావరణానికి హాని చేయని సరుకులు గడప దగ్గరికి అందిస్తారు. తద్వారా స్థానిక ఉత్పత్తి, వినియోగ వృత్తాన్ని ప్రోత్సహిస్తున్నారు.

వీరి కార్యక్రమం ద్వారా జీవన విధానాన్ని పర్యావరణానికి అనుకూలంగా మారుస్తున్నారు. అదే కాకుండా సహకారం, సహ భావనలను సభ్యులలో పెంపొందిస్తున్నారు. ఇదే ఈ సంస్థ 'లైఫ్'కు చేస్తున్న కృషి.

**సామాజిక సేవా సంస్థల (సి.ఎస్.ఓ.) చొరవతో 'లైఫ్':** భారతదేశ పశ్చిమ భాగంలో సాత్‌పుధా పర్వత కనుమలలో ఒక మారుమూల ప్రదేశం నందుర్‌బార్. జనాభా పూర్తిగా గిరిజనులు అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తుంటారు. 'లైఫ్' ఉద్యమంలో భాగంగా జిల్లాలో ఒక సామాజిక




సంస్థ స్థాపించి, 25 సంవత్సరాలు అయిన సందర్భంలో (1 జులై, 2023 నాడు) 25 వేల మొక్కలను నాటి 'లైఫ్' కార్యక్రమానికి ఆ ప్రాంతపు గిరిజనుల భవిష్యత్ అవసరాలు తీర్చటానికి ముందుకు అడుగు వేసింది.

**'లైఫ్' పై డిజిటల్ ప్రతిజ్ఞ:** 'సి-20' లో భాగంగా ఏర్పాటైన 'లైఫ్ వర్కింగ్ గ్రూప్' పేరెన్నిక కలిగిన ఉన్నత విద్యా సంస్థలు, అనేక సామాజిక సేవా సంస్థలతో కలిసి 'లైఫ్' పై డిజిటల్ ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో వందల పౌరులు దేశం నలుమూలల నుంచి సోషియల్ మీడియా ద్వారానే కాక, వ్యక్తిగతంగా కూడా పాల్గొన్నారు.

**'లైఫ్' తో పట్టణ ప్రాంత జీవితంపై ఒక వ్యక్తిగత దృష్టాంతం:** శ్రీ మయూర్ భావే శ్రీమతి సుజాత భావే వారి కుటుంబంతో భారత దేశం లోని మహారాష్ట్రలో పూణే పట్టణంలో నివసిస్తున్నారు. 6గురు సభ్యులు కల ఈ కుటుంబం '5 ఆర్' సూత్రాలను వద్దనటం (రెఫ్యూజ్), తగ్గించటం (రెడ్యూజ్), తిరిగి వాడటం (రీ యూజ్), పునర్నిర్మించటం (రీసైకిల్), తిరిగి నింపటం (రిప్లనిష్) తప్పకుండా పాటిస్తున్నారు. వీరి కుటుంబం నిర్వహించే బయోగ్యాస్ ప్లాంట్ 75% వీరి వంట గదినుండి వచ్చే వ్యర్థాలతో, 100% వ్యర్థాల నిర్వహణతో నడుస్తున్నది. వీరి ఇంటి డాబాపై ఏర్పాటు చేసిన తేనెపట్టు డబ్బా (హనీబీ బాక్స్) ఇంటికి తేనెని, చల్లదనాన్ని ఇవ్వటమే కాక, చుట్టుప్రక్కల ప్రాంతల్లో పరపరాగ సంపర్కానికి దోహద పడుతోంది. భావే కుటుంబం వీటిని ఆదా చేయటానికి అనేక మార్గాలు పాటిస్తూ, వాటినే తమ జీవన శైలిలో భాగంగా చూసుకున్నారు.

మన నిత్య జీవితంలో పర్యావరణంపై భారాన్ని తగ్గించటానికి మనం నిరంతరం ఆలోచించి చేతనైన చర్యలే 'లైఫ్' విధానానికి మూలం.

**పురాతన సాంప్రదాయాన్ని పునరుద్ధరించటం ద్వారా సామాజిక నీటి రక్షణగా 'లైఫ్':** 'హల్మా' అనేది భారత దేశపు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 'జబువా' జిల్లాలో, భిల్ సమాజానికి చెందినవారు ఆచరించే సాంప్రదాయం. ఈ సాంప్రదాయం అవసరమున్న వారికి ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేయటం అన్న ప్రాతిపదికన పనిచేస్తుంది. జబువా జిల్లాలోని ప్రజలు 'భూమాత' అతి ఎక్కువ కష్టంలో ఉందని నమ్ముతారు. భూమి దాహార్తి – ఆమెకి అత్యవసరంగా నీరు అందించాలి. ఆ ప్రాంతంలో 2010 నుంచి పని చేస్తున్న 'శివగంగ అభియాన్' అనే ఒక సామాజిక సంస్థ ప్రతి సంవత్సరం 'హల్మా' కార్యక్రమానికి పిలుపునిస్తుంది. వేలకొద్దీ గిరిజనులు ఈ ఉద్యమంలో స్వచ్ఛందంగా పాల్గొంటారు. వారితోపాటు భూమిని తవ్వటానికి అవసరమైన పనిముట్లు తామే తెచ్చుకుంటారు. పంట వేయటానికి ఆకృతి (కాంటూర్) సేద్యానికి వీలుగా కొండ ప్రాంతాలను త్రవ్వి పంటలు, మొక్కలు నాటుతారు. ఇదంతా వారు స్వలాభాపేక్ష లేకుండా సమాజం కోసం చేస్తున్న సేవ. ఈవిధంగా ప్రతి గ్రామ ప్రజలు వారివారి ప్రాంతంలో నిస్వార్థ సేవ చేసి, కొండమీద నుండి కిందికి పారే నీటిని ఆపి, భూమాత దాహార్తి తీర్చి, తమకు అనువైన పంటలను పండించు కుంటున్నారు. ఈ ప్రయత్నము గణనీయమైన వాతావరణ మార్పుకు దోహదకారియై, నీటి వనరులు, వ్యవసాయం, ఆదాయం చెప్పుకోదగ్గ స్థాయిలో మెరుగు పడ్డాయి. ●

(సంపూర్ణం)



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## వ్యవసాయ వ్యర్థాలను ఎరువుగా మార్చే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

సేంద్రియ వ్యవసాయ విధానంలో 'కంపోస్టు' ఎరువు కున్న ప్రాధాన్యత మరి దేనికీ లేదు. వ్యవసాయ వ్యర్థాలు, ఇళ్ళ లోని చెత్తతో కంపోస్టు చేసుకోవచ్చు అని అందరికీ తెలుసు. కాకపోతే దానికి సాధారణంగా 3–4 నెలల సమయం పడు తుంది. ఈ కాల పరిమితిని తగ్గించే యంత్రాలు విదేశాల్లో మాత్రమే లభించేవి. కానీ 'ఉర్మెల్ సింగ్ ధోన్సీ' అనే రాజస్థాన్‌కు చెందిన ఇన్నోవేటర్ ఈ ప్రక్రియని కేవలం 25 నుండి 40 రోజుల లోపలే చేసే పరికరాన్ని కనుగొన్నాడు. అతను చెప్పిన దాని ప్రకారం ఈ యంత్రం ద్వారా కంపోస్టు తయారు చేయటా నికి టన్నుకు కేవలం 2 రూపాయలు ఖర్చవుతుంది.

**పరికరం :**

చెత్తను తిరగవేయటం యంత్రం సహాయంతో జరుగు తుంది. ఈ యంత్రాన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకో వచ్చు. యంత్రంలో భాగంగా ఒక రోటర్ షాఫ్ట్‌కు కొన్ని బ్లేడ్లు అమర్చబడి వుండి ఆ బ్లేడ్లు తిరుగుతూ చెత్తను తునకలు చేస్తూ, తడి కూడా అందజేస్తాయి. ఎండాకాలంలో 5 రోజులకోసారి, చలి కాలంలో 7 రోజులకోసారి చొప్పున 5–6 సార్లు చెత్త కుప్పపైకి ఈ యంత్రాన్ని తోలుకుంటూ వెళ్ళితే చాలు అదే చెత్తను కలిపి నీరు అందించటం వల్ల ఆ చెత్త కంపోస్టుగా తయారవుతుంది.



**సాంకేతిక వివరాలు :**

- 400 టన్నుల చెత్తను ఒక గంటలో కలియ గలుపుతుంది.
- గంటకు మూడున్నర నుంచి 4 లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది.
- 50 హెచ్‌పి ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం చెయ్యవచ్చు.
- రోటర్ 16 అంగుళాల వ్యాసం, 9 అడుగుల పొడవు కలిగి వుండి, 9 బ్లేడ్లు అమర్చబడి వుంటాయి.
- క్రోమ్ స్టీల్‌తో తయారు చేయబడిన ప్రత్యేకమైన గేర్‌బాక్స్
- రోటర్‌ను క్రిందకు, పైకి కదపటానికి అనువుగా హైడ్రాలిక్ సదుపాయం కలదు.
- 2000 లీటర్ల సామర్థ్యమున్న నీటి ట్యాంకు అమర్చబడి వుంటుంది.

**ముఖ్యాంశాలు :**





- ❀ ఈ యంత్రం సహాయంతో 120 నుండి 150 రోజుల్లో తయారయ్యే కంపోస్టు 25–40 రోజుల్లోనే తయారు చేయవచ్చు.
- ❀ పేడ కంపోస్టుకన్నా ఈ కంపోస్టులో పోషక విలువలు ఎక్కువ.
- ❀ ఈ పనంతా ఒకేవ్యక్తి చేసుకోవచ్చు.
- ❀ నిరుద్యోగులకు, ఎక్కువ కంపోస్టు అవసరమైన వారికి ఇది ఎంతో అనువైన యంత్రం.
- ❀ నలుగురు నిరుద్యోగులు ఈ యంత్రాలను పట్టణాల్లో ఏర్పాటు చేసుకుంటే వారికి ఉపాధి, రైతులకు తక్కువ ధరలో సేంద్రియ ఎరువు అందించటంతో పాటు, పట్టణా లను చెత్త దుర్గంధం నుండి కాపాడి ఆరోగ్యకరమైన వాతా వరణం అందించవచ్చు.

**పురస్కారం :**

- ❀ ఇన్నోవేటర్ 'గుర్మీల్‌సింగ్ ధోన్సీ' కి ఎన్ఐఎఫ్ వారి 'ఉత్తమ సాంప్రదాయ జ్ఞానం' బహుమతిని 2012లో రాష్ట్రపతి అందజేశారు.

## పాలు పితికే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

డెయిరీ ఫారంలు, ఎక్కువ పాడి పశువులు వున్న వారికి పశువులనుండి పాలు పితకడం ప్రధాన సమస్య. నేర్పరులైన కూలీలు





లభించటం కూడా దుర్లభంగా మారుతోంది. పైగా చేత్తో పితకడం అన్నది ఆరోగ్యకరమైన పద్ధతి కాదు అన్న భావన ప్రబలుతోంది. పాలు పితకటానికి యంత్రాలున్నా, చాలా ఎక్కువ పెట్టుబడి కావాల్సి వస్తోంది. ఈ సమస్యకి పరిష్కారంగా కర్నాటకకు చెందిన 'రాఘవ గౌడ' తక్కువ ఖరీదులో పాలు పితికే యంత్రాన్ని తయారు చేశాడు.

**పరికరం :**

ఇది చేతితో నడిపే విధంగా, యంత్ర సహాయంతో పని చేసే విధంగా రెండు రకాలుగా తయారు చేశాడు. తక్కువ పాడి పశువులున్న వారు కూడా దీనిని కొనుగోలు చేసి ఉపయోగించుకోవచ్చు. దీన్ని ఉపయోగించటం చాలా సులభం. స్త్రీలు కూడా సులభంగా ఉపయోగించుకోవచ్చు.

**సాంకేతిక వివరాలు :**

- ❀ ఈ యంత్రం తయారీలో మేలురకపు స్టీలు ఉపయోగించ బడినది.
- ❀ 18 కిలోల బరువున్న చేతితో నడిపే ఈ యంత్రం సహా యంతో ఒకసారి, ఒక పశువు నుండి పాలు పితకవచ్చు.
- ❀ సెమీ ఆటోమేటిక్‌లో కరెంటు లేదా బ్యాటరీతో పని చేసే యంత్రాలు కూడా అందుబాటులో వున్నాయి.

**ముఖ్యాంశాలు :**

- ❀ ఒక పశువుకు పాలు పితకటానికి కేవలం 4 నుండి 6 నిమిషాలు పడుతుంది.
- ❀ నిమిషానికి ఒకటిన్నర నుండి 2 లీటర్ల పాలు పితక వచ్చు.





❀ చేత్తో పాలు పితకడం వుండదు కనుక పూర్తిగా ఆరోగ్య ప్రదాయమైనది.

❀ పశువుకు ఎటువంటి హాని కాని, అసౌకర్యం కాని కలగదు.

❀ ఎటువంటి ఖర్చు లేకుండా 8 నుండి 10 సంవత్సరాల వరకు పని చేస్తుంది.

**పురస్కారం :**

❀ 2005లో ఇన్నోవేటర్ రాఘవ గౌడకు ఈ యంత్రం కనిపెట్టినందుకు గాను ఎన్ఐఎఫ్ వారు నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా పురస్కారం అందించడ మైనది. ●

**వివరాలకు సంప్రదించండి:**

**ఇన్నోవేటర్ : రాఘవ గౌడ, ఫోన్: 94481 44098, 94487 25520,**

**పల్లెసృజన, సుభాష్, ఫోన్: 96528 01700**

**E mail: subhash4@gmail.com,**

**Phone: 96528 01700**

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

**దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.**













హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి. ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :

77, రోడ్ నెం. 3, వాయుపురి,

సైనిక్‌పురి పోస్టు,

సికింద్రాబాద్ - 500 094.

ఫోన్ : 040-49253096,

సెల్ : 96528 01700.

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- వీరరాఘవ రెడ్డి

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 77 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

## కొబ్బరి బోండాంల ష్రెడ్డర్
## ఉపాధితో పాటు ఊరు పరిశుభ్రం

ఈరోజుల్లో మనిషి ఆరోగ్య రీత్యా మొట్టమొదటిగా డాక్టరు కొబ్బరి నీళ్ళు త్రాగమని చెబుతున్నారు. అందువల్ల ప్రతి గ్రామం మరియు పట్టణాల్లో కొబ్బరి బోండాంల విక్రయం బాగా పెరిగింది. కొబ్బరి నీళ్ళు త్రాగడం మంచి ఆరోగ్యాన్ని ఇస్తుంది. కానీ, ఆ త్రాగి పారవేసిన కొబ్బరి బోండాంల వలన ఇటు పురపాలక శాఖ, అటు గ్రామ పంచాయతీలు వాటిని సేకరించి డంపింగ్ యార్డుకు తీసుకువెళ్ళడం పెద్ద సమస్యగా మారింది. అలాగే డంపింగ్ యార్డులో కూడా గుట్టలు గుట్టలుగా బోండాంలు పేరుకు పోవడం వలన వీటి నిర్వహణ సమస్యగా మారుతుంది. అలాగే స్థల సమస్య అధికమౌతోంది.

కానీ ఈ వ్యర్థ కొబ్బరి బోండాముల వల్ల కూడా ఎన్నో లాభాలు చేకూర్చుకోవచ్చు!

ఈ రోజుల్లో రైతులు పంటలు పండించడానికి ఎన్నో రకాల క్రిమి సంహారక మందులను వాడుతున్నారు. ఈ వ్యర్థ కొబ్బరి బోండాములు మరియు ఎండు కొబ్బరి కాయలను ఉపయోగించి, రైతులు పంటలకు కావలసిన సహజ ఎరువులను గ్రామాల్లోనే తయారు చేసి, తోటి రైతులకు అందించి ఉపాధి పొందవచ్చు.

ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ లోని సంగారెడ్డి జిల్లా, మెట్‌పల్లికి చెందిన ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్ "కోకనట్ ష్రెడ్డర్ మిషన్" తయారు చేయడం జరిగింది. వీరు ఇప్పటికే తయారు చేసిన ఎన్నో ఇన్నోవేషన్లు పల్లెసృజన పాఠకులకు సుపరిచితమే. ఆయన ఇటీవల తయారు చేసిన ఈ యంత్రం ద్వారా వ్యర్థ కొబ్బరి బోండాముల నుండి 2 రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చు.







**1. కోకో పిత్:** ఇది పౌడర్ లాగా ఉండి రైతులు పంటలు పండించ డానికి ఎరువుగా తమ పంట పొలాలు, నర్సరీలు, గార్డెన్స్ మరియు తమ ఇళ్ళల్లో మొక్కలకు ఎరువుగా వాడుతున్నారు. దీనివలన నేలలో నీటి శాతం ఎక్కువ రోజులు ఉండటం వలన పంటలకు, మొక్కలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

**2. కోకో ఫైబర్:** ఇది వాణిజ్యపరంగా ఎంతో లాభసాటిగా ఉంటుంది. ఈ కొబ్బరి పీచు ద్వారా కొబ్బరి తాళ్ళు, కుర్చీలు, సోఫాలు, ఫాల్స్ సీలింగ్ వంటి వాటి తయారీలో ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఈ 'కోకనట్ ష్రెడ్డర్ మిషన్'ను చిన్న గ్రామాలు, పట్టణాలలో కూడా సులువుగా ఏర్పాటు చేసుకొనే విధంగా ఈ మిషన్‌ను తయారు చేయడం జరిగింది.

- ❀ ఈ యంత్రంలో సింగల్ ఫేస్ మరియు 3 ఫేస్ విద్యుత్‌తో నడిచే 3 హార్స్‌పవర్‌ల మోటారు బిగించడమైనది.
- ❀ ఈ మిషన్ గంటకు సుమారు 200 కొబ్బరి బోండాంలను క్రష్ చేస్తుంది.
- ❀ ఈ యంత్రం ద్వారా చిన్నపాటి పరిశ్రమ ఏర్పాటు చేసుకొని నలుగురు సభ్యులకు ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చు.

గ్రామీణ యువత ఈ యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవడం ద్వారా మీ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మీ ఉపాధిని కూడా సులభంగా పొందవచ్చు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో రైతుకు అవసరమైన వివిధ పంటల నారును పోషించి విక్రయించుకునేందుకు 'గ్రీన్ షేడ్ నర్సరీ'లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాటిల్లో నారు పెంచేందుకు ట్రేలను ఉపయోగిస్తారు. ఆ ట్రేలలో ఈ యంత్రం ద్వారా తయారైన కోకోపిత్‌ను నింపి అందులో నారును పెంచడం ద్వారా నారును చాలా సులభంగా పీకవచ్చు. కోకోపిట్‌తో పాటు వచ్చే కొబ్బరి నారును మీ గ్రామానికే వచ్చి పైన చెప్పిన వివిధ రకాల వ్యాపారస్తులు తీసుకు వెళ్తారు.




ఈ యంత్రం ఏర్పాటు చేసుకున్న యువకులు ప్రధానంగా చేయవలసింది కొబ్బరి బోండాంలను, తాటి ముంజలను సేకరించడం, ఒకరిద్దరు యువకులు యంత్రం వద్ద ఉండి కోకోపిత్ మరియు కొబ్బరి పీచులను తయారు చేసి ఉంచ గలిగితే చాలు. వీటి మార్కెటింగ్ చాలా సులభం. ఇందులో కొబ్బరి బోండాంలే కాదు, తాటి ముంజలు, తాటిచెట్టు, కొబ్బరి చెట్టు, పామోలిన్ చెట్ల ఆకుల మొదళ్ళను కూడా వేసి కోకోపిత్ మరియు పీచులను తయారు చేయవచ్చు.

తక్కువ పెట్టుబడి, కొద్దిపాటి శ్రమతో మంచి ఆదాయం పొందటంతో పాటు, మీ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో మీ పాత్ర అమోఘంగా ఉంటుంది. మీకు ఆదాయమే కాక, గ్రామీణుల దృష్టిలో మీ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారన్న మంచి ఖ్యాతి మీకు దక్కుతుంది.

ఇందుకు మీరు కొనుగోలు చేయవలసింది ఒక్క ఈ యంత్రం మరియు కొబ్బరి బోండాంలు, తాటి ముంజలు, ఆ చెట్లకు ఉన్న వాటి ఆకుల మొదళ్ళను సేకరించి, వాటిని మీ యంత్రం వరకు చేర్చేలా ఒక ట్రాక్టరును కిరాయికి తీసుకుంటే సరిపోతుంది.

ఇక ఆలస్యమెందుకు కనీసం మండలానికి ఒక యూనిట్‌ను ఏర్పాటు చేసుకో గలిగితే గౌరవప్రదమైన ఆదాయ మార్గం మీకు సొంతం.

ఈ వ్యాపారం ప్రారంభించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు, యంత్రాలను గురించి వివరాలు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవలసిందిగా కోరుతున్నాం.

**ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్ ఫోన్ నెం.: 94400 37475**
**వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 8125799904/ 7989038186**

విశేషాలు

# సెప్టెంబర్- అక్టోబర్ 2024 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాల చిత్రాలు









2024 అక్టోబర్, 25 నుండి 27 వరకు 'పల్లెసృజన' ప్రతిష్ఠాత్మకంగా చేస్తున్న 50వ 'చిన్నశోధయాత్ర' ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ జిల్లా "ఏలేశ్వరం నుండి కొమరాపురం వరకు నిర్వహించింది. ఈ శోధయాత్రలో 50 కి పైగా పాల్గొనడం జరిగింది. కొండ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల గుండా ప్రకృతిని ఆనందిస్తూ, ప్రజలతో సంభాషిస్తూ స్థానిక విశిష్ఠతలను పల్లెజ్ఞాన సంపదను పత్యక్షంగా చూసి, విని గ్రంథస్తం చేశారు.





2024 సెప్టెంబర్, 26వ తేది 'మేనేజ్', హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని 13 దేశాలకు చెందిన 29 ప్రభుత్వ ఉన్నతాధికారులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించినప్పటి దృశ్యాలు.






పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలపై అవగాహన కోసం 'ప్రగతి సెంట్రల్ స్కూల్' కూకట్ పల్లి నుండి ప్రతిరోజు 50 మంది చొప్పున 560 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. పల్లెసృజన ఇన్నోవేటర్లు తయారు చేసిన ఇన్నోవేషన్లను వారికి చూపటం జరిగింది. విద్యార్థులతో పాటు రోజు ఇద్దరు ఉపాధ్యాయులు కూడా పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమం నవంబర్ 10వ తేది వరకు జరుగుతుంది.








'పల్లెసృజన' బృందం విజయవాడ లోని 'క్రిష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రీ ఎకాలజీ'ని వారి ఆహ్వానం మేరకు 2024 అక్టోబర్, 20న 18 ఇన్నోవేటర్లు, 14 వాలంటీర్లతో కూడిన 'పల్లెసృజన' బృందం సందర్శించింది. అకాడమీలో చేస్తున్న ప్రయోగాలు, వ్యవసాయంపై శిక్షణా పద్ధతులను డా. రామాంజ నేయులు గారు స్వయంగా వివరించారు. పల్లెసృజన స్థానిక రైతులకు రకరకాల వ్యవసాయ సంబంధిత ఇన్నోవేషన్లను పరిచయం చేసింది. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న వారికి 'పల్లెసృజన ' ఇన్నోవేషన్లు మరియు చేస్తున్న కార్యక్రమాలను గురించి సవివరంగా వివరించారు 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు.



5 సెప్టెంబర్, 2024 న ప్రొఫెసర్ యశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించి, వ్యవసాయంలో స్త్రీల పాత్ర అన్న అంశంపై చర్చ జరిపారు.



9 సెప్టెంబర్, 2024 న పూణే కు చెందిన ఇన్నోవేటర్ నిహాల్ అత్తర్ వర్క్‌షాప్‌ను 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు సందర్శించారు. అతను రైతుల కొరకు చేస్తున్న చిన్న వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను పరిశీలించారు.




12 సెప్టెంబర్, 2024 న హైదరాబాద్ లోని సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఇంజనీరింగ్ కోర్సులో చేరిన విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన కార్యక్రమలో 'పల్లెసృజన' వాలంటీర్ సుభాష్ చందర్ పాల్గొని గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్‌ల పట్ల వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 1700 మందికి పైగా విద్యార్థులు, 10 మంది ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# యువత అవగాహనకై
# సంస్కృతం మరియు తెలుగులో ప్రకృతిలో లభించే చెట్ల పేర్లు

**సేకరణ : పర్యావరణ వేత్త "కొమెర జాజి"**



మారుతున్న కాలమాన పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం నేటి యువతకు చాలా వరకు చెట్ల పేర్లు తెలియటం లేదు. వాటిని పిల్లలకు తెలియజేసే వారు కూడా కరువయ్యారు. ఈ విషయం అవగాహన చేసుకున్న పర్యావరణవేత్త "కొమెర జాజి" పల్లెసృజనకు తాను సంస్కతం మరియు తెలుగు లో సేకరించిన చెట్ల పేర్లను తెలియజేస్తున్నాడు. వీటిని మీ చిన్నారులచేత తప్పక చదివించండి. వీలైతే మీ పరిథిలో వారు అడిగిన చెట్లను చూపించండి. ఇలా చేయటం వల్ల ప్రకృతి పట్ల చిన్నారుల్లో అవగాహన పెరుగుతుంది. భవిష్యత్తులో వారికి చెట్లపైన అవగాహన పెరిగి, పర్యావరణం రక్షించదానికి దోహద పడుతుంది. **-ఎడిటర్**

| వ. సం. | సంస్కృతం | తెలుగు |
|---|---|---|
| 1. | అంకోలా | - ఊడుగ చెట్టు |
| 2. | అంగార వృక్ష | - గార చెట్టు |
| 3. | అంజనీ | - అల్లి చెట్టు |
| 4. | అంజీర | - అంజీర |
| 5. | అంత్ర పాచక | - మనుబాల |
| 6. | అంబాష్ట | - బొద్ది చెట్టు |
| 7. | అంబుద ఫల | - తొగరు చెట్టు |
| 8. | అంబు ప్రసాద | - ఇండుప గింజలు |
| 9. | అకార కారభ | - అక్కల కర్ర |
| 10. | అగత్యా | - అవిసె చెట్టు |
| 11. | అగరు | - కృష్ణాగరు |
| 12. | అగ్ని మన్థ | - నెల్లి |
| 13. | అగ్ని ముఖి | - జీడీ గింజలు |
| 14. | అగ్ని శిఖా | - పొత్తి దుంప |
| 15. | అట రూష | - అడ్డ సరము |
| 16. | అతంత్రి | - కాఫీ చెట్టు |
| 17. | అతసీ | - అవిసె చెట్టు |
| 18. | అతి బలా | - తుత్తురు బెండ |
| 19. | అతి విషా | - అతి వస |
| 20. | అజగంధా | - వాయింట చెట్టు |
| 21. | అనంత | - పాల సుగంధి |
| 22. | అనంనాసా | - అనాస పండు |
| 23. | అపామార్గ | - ఉత్తరేణి |
| 24. | అఫిన | - నల్లమందు |
| 25. | అభయ | - కరక్కాయ |
| 26. | అమరవల్లీ | - పాచితీగ |
| 27. | అమృత ఫల | - అమృత ఫలము |
| 28. | అమృత వల్లి | - తిప్పతీగ |
| 29. | అమృతోపహిత | - ఫిరంగి చెక్క |
| 30. | అరణ్య జీర | - అడవి జీలకర్ర |
| 31. | అరణ్య వాస్తుక | - దొగ్గలి కూర |
| 32. | అరలు | - దుందిలపు చెట్టు |
| 33. | అరిష్టక | - కుంకుడు చెట్టు |
| 34. | అరుణా | - అతివన |
| 35. | అర్క | - జిల్లేడు |
| 36. | ఆర్కా పుష్పక | - కోల పాలకూర |
| 37. | ఆర్క వల్లభ | - మంకెన చెట్టు |
| 38. | అర్జున | - తెల్లమద్ది |
| 39. | అల్ప దహన | - అగ్ని వేంద్రపు చెట్టు |
| 40. | అవల్గుజ | - కారుగచ్చ చెట్టు |
| 41. | అశోక | - అశోక చెట్టు |
| 42. | అశ్మరిఘ్న | - ఉలిమిడి చెట్టు |
| 43. | అశ్వ కర్ణిక | - ఏపె చెట్టు |
| 44. | అశ్వ గంథ | - పెన్నేరు చెట్టు |
| 45. | అశ్వ ఘాతుక | - గన్నేరు చెట్టు |
| 46. | అశ్వర్థ | - రావిచెట్టు |
| 47. | ఆసన | - వేగిస చెట్టు |
| 48. | ఆస్తి సంహారిక | - నల్లేరు |
| 49. | అక్షోస | - అక్రోటు |
| 50. | అకల్లక | - అక్కలకర్ర |
| 51. | ఆకాశ వల్లి | - పాచితీగ |
| 52. | ఆతాపి ఫల | - శీతాఫల చెట్టు |
| 53. | ఆత్మ గుప్తా | - పెద్దదూల గొండి |

54. ఆదిత్య వల్లి - మాండుక బ్రహ్మి
55. ఆమలిక - మామిడి చెట్టు
56. అమ్రగంధ - రేల చెట్టు
57. అమ్లపీలు - పుల్ల గోంగూర
58. అమ్ల లోనికా - పులి చంచలి
59. అమ్లిక - పుల్ల బచ్చలి
60. అరగ్వధ - రేల చెట్టు
61. అర్జట - ఆదొండ చెట్టు
62. ఆర్త గళ - ముళ్ళ గోరింట చెట్టు
63. ఆర్శోఘ్న - అడవి కంద
64. ఆవర్తని - నులిదడ చెట్టు
65. అస్ఫోట - అడవి మల్లి
66. ఇంగుదీ - గార చెట్టు
67. ఇందీవర - కలువ దుంప
68. ఇంద్ర ద్రుమ - నల్లమద్ది చెట్టు
69. ఇంద్రయవ - కొడిసెపాల చెట్టు
70. ఇంద్ర వారుణి - వెర్రి పుచ్చ చెట్టు
71. ఇంద్రాణికా - తెల్ల వావిలి
72. ఇంద్రాక్ష - ఋషభక మాను మూలిక
73. ఇక్ష గంధా - నీరు గొబ్బి చెట్టు
74. ఇక్ష గంధ - చిన్న పల్లేరు
75. ఉగ్ర గంధ - వస
76. ఉత్పల - కలువ పువ్వు
77. ఉత్పల శరిబా - గేదె సుగంధి
78. ఉదుంబర - మేడి చెట్టు
79. ఉన్మత్త - ఉమ్మెత్త చెట్టు
80. ఉపవిస - అతి వస
81. ఉపోదకి - మట్టు బచ్చలి
82. ఉశీర - తెల్ల వట్టి వేళ్ళు
83. ఏరండ - ఆముదపు చెట్టు
84. ఏరెండ చిర్భిటా - మద నానబ చెట్టు
85. ఏలా వాలుక - కూతురు బుడమ
86. ఓల్ల - కంద
87. కంటక ఫల - పనస పండు
88. కంటకారి - వాకుడు చెట్టు
89. కంట పత్ర ఫల - బ్రహ్మ దండి
90. కంటాల - రాకాసి మట్టలు
91. కంబు పుష్ప - శంఖ పుష్పము
92. కకుబ - తెల్ల మద్ది చెట్టు
93. కచు - చామ చెట్టు
94. కటిల్ల - కాకర
95. కటుక తుంబి - చేదు అనప చెట్టు
96. కట్వ - కట్ల తీగె
97. కట్వంగ వృక్ష - పెను వేప చెట్టు
98. కదంబ - కడిమి చెట్టు
99. కదళి - అరటి చెట్టు
100. కన్యా - కలబంద
101. కపికచ్చు - పెద్ద దూలగొండి
102. కపిత్థ - వెలగ చెట్టు
103. కపిద్దార్జున - అడవి గగ్గెర
104. కపోతాంఘ్రి - పగడపు తీగె
105. కమల - తామర
106. కరంజక - కానుగ చెట్టు
107. కర వల్లభ - వరగోగు
108. కర మర్దక - వాక చెట్టు
109. కరవీర - గన్నేరు చెట్టు
110. కరామ్ల - వాక చెట్టు
111. కర్కటి - నక్కదోసకాయ
114. కర్కోటకి - అంగాకర చెట్టు
115. కర్పూర హరిద్ర - కస్తూరి పసుపు
116. కర్బూజా - కర్బూజా పండు
117. కలికారీ - పొత్తి దుంప
118. కలివృక్ష - తాడి చెట్టు
119. కశేరుకం - నమ్మదుంప
120. కళ్యాణి - నేల తంగేడు
121. కాంచన - కాంచన వృక్షము
122. కాండ పుంఖ - వెంపల చెట్టు
123. కాంభోజి - తెల్ల పురుగుడు
124. కాకజంఘు - వెలమ సంధి
125. కాకబింబ - కాకిదొండ
126. కాక మర్ద - కాకిదొండ
127. కాక మాచిక - కామంచి చెట్టు
128. కాక ముద్ద - పిల్లి పెసర
129. కాకాండ - చెప్పు తుట్టాకు
130. కాకో దుంబరికా - బ్రహ్మ మేడిచెట్టు
131. కానన ఏరండ - నేపాళపు చెట్టు
132. కాటుక - విళంబి కాయలు
133. కాల వృంతా - కలిగొట్టు చెట్టు
134. కాలేయక - పిత చందనం
135. కాశ - రెల్లు గడ్డి.
136. కాశ్మీరజ - కుంకుమ పువ్వు
137. కాశ్మీరి - గుమ్మడి చెట్టు
138. కాష్టక దళీ - అడవి అరటి చెట్టు
139. కాష్ట శారీభా - పాల సుగంధి
140. కాసమర్ద - కసివింద చెట్టు
141. కంకి రాత - కొండ గోగు
142. కింశుక - మోదుగ చెట్టు
143. కిరాత తిక్త - నేల వేము
144. కీటమారి - గాడిద గడపాకు చెట్టు
145. కుండ లచ్చద - అటుల మామిడి
146. కుంజరాసన - రావిచెట్టు
147. కుంతల వర్ధన - గుంట గలగర
148. కుంద - మొల్లయను పుష్పము.

**(మరిన్ని వివరాలకు, తప్పు ఒప్పులకు 'జాజి' గారిని సంప్రదించండి**

**ఫోన్: 9908411722**

**(వచ్చే సంచికలో మరికొన్ని చెట్ల పేర్లు)**



## కరెంటు, ఇంధనం అవసరం లేకుండా నీటి పారుదల

# 'ర్యాం పంపు, హైడ్రో లిఫ్టింగ్ పంపులు ఏర్పాటు చేసిన "పంపన శ్రీనివాస్"

- వీర రాఘవ రెడ్డి

ఆంధ్ర ప్రదేశ్ లోని కాకినాడ జిల్లా పెదపూడి మండలం, కైకవోలు గ్రామానికి కు చెందిన 47 సంవత్సరాల 'పంపన శ్రీనివాస్' చదివింది ఐటిఐ. వీరిది వ్యవసాయ కుటుంబం. శ్రీనివాస్ తనకున్న ఐటిఐ పరిజ్ఞానంతో గ్రామంలో మోటార్ లు ఇతర చిన్న చిన్న యంత్రాలను రిపేరు చేసుకుంటూ జీవనం కొనసాగి స్తూనే తనకంటూ ఏదో ఒక ప్రత్యేకత ఉండాలని తనకున్న సృజనాత్మకత తో వున్న మోటార్లకే ఏదో ఒక కొత్తదనాన్ని ఏర్పాటు చేసి, దాని పని తనాన్ని పెంచేలా చేస్తూ వుండేవాడు. ఇలా చేస్తున్న శ్రీనివాస్‌కు తన తండ్రే ఒక సవాల్‌ను విసిరాడు. "ఎప్పుడూ ఏదో ఒకటి వున్న యంత్రాని కి కొత్తదనం ఏర్పాటు చేసి దాని సామర్థ్యాన్ని పెంచుతున్నావు సరే, ఇలా ఉన్న వాటిని ఎన్నింటిని రిపేర్లు చేసినా నీకంటూ ఓ ప్రత్యేకత ఉండదు, ఏదైనా ఒక గొప్ప పని గురించి ఆలోచించు, ఆ పని 'నువ్వు మాత్రమే చెయ్యగలవు' అని నిరూపించుకో" అని కొడుకును ఉసిగొలుపు తూ ఉండేవాడు.

శ్రీనివాస్ చేస్తున్న సృజనాత్మక పనులను తెలుసుకున్న ఆ ప్రాంతంలోని ఇంజనీరింగ్ చదువుకున్న విద్యార్థులు ఇతని వద్దకు వచ్చి తాను చేసిన పనులను గమనిస్తూ, నీకు మంచి ఇంజనీరింగ్ తెలివి ఉంది, మీ నాన్న చెప్పినట్లు ఏదైనా కొత్తదనం గురించి ఆలోచించు, దానికి అవసరమైన సలహాలు, సూచనలను మేమూ అందిస్తుంటాము అనేవారు. ఏదో ఒకటి సాధించాలి అనుకున్న సమయంలో తన గ్రామ సమీపంలో గల ఒక వంక నుండి రైతులు డీజిల్ ఇంజన్‌తో నీళ్ళు తోడు కుని తమ పొలాలకు పారించుకోవటం గమనించాడు. ప్రస్తుతం ప్రభుత్వాలు రైతులకు ఉచిత కరెంటు ఇస్తున్నా కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు కాబట్టి అక్కడ తప్పనిసరిగా డీజిల్ ఇంజన్‌లనే ఉపయోగించాల్సి వస్తుంది. ఇటువంటి చోట డీజిల్ ఖర్చు కూడా లేకుండా నీరు పారించ గలిగితే మేలు కదా అనుకున్నాడు. అతని ఆలోచనలను విన్న ఇంజనీరింగ్ విద్యార్థులు 'ర్యాం పంపు' గురించి వివరించారు. దీన్ని చాలా కాలం క్రితం ఉపయోగించారు కానీ అనుకున్నంత విజయవంతం కాలేదు. దాన్ని ప్రయోగించి చూడు అని సలహా ఇచ్చారు. ఇతని ఆలోచనకు 'టాటా' సంస్థ వారు ముందుకు వచ్చి ఇతనికి కావలసిన ర్యాం పంపుకు చెందిన సామాగ్రిని సమకూర్చడంతో ఇతని పని సులువైంది.

**'ర్యాం పంపు' పని చేసే విధానం :**

వాగులు, నదులలో ఎక్కడైనా సరే కనీసం 4నుండి 6 అడుగుల ఎత్తు నుండి నీరు క్రిందకు పారుతున్న చోట దీన్ని అమర్చవచ్చు. ఎత్తు నుండినీరు పారేచోటి కనీసం 20 అడుగుల పొడవున్న పైపు ద్వారా ర్యాంపంపు యూనిట్లు బిగించి, సివిల్ వర్క్ దృఢంగా చేసి, 30 రోజుల తర్వాత ఆ పంపును ఉపయోగిస్తాడు. అలా పైపు ద్వారా వేగంగా వచ్చే నీరు పిస్టన్‌ల ద్వారా పారుతూ ఉంటుంది. అప్పుడు ఏర్పాటు చేసిన రెండు పిస్టన్‌లలో ఒకదాన్ని కాలితో లేదా చేతితో రెండు మూడుసార్లు కిందకు నొక్కితే చాలు ఇక వాటంతట అవే రెండు పిస్టన్‌లు ఒకదాని తర్వాత ఒకటి పైకి, క్రిందకు లేచి పడుతూ ఉంటాయి. అలా పిస్టన్‌లు పని చేయటం వల్ల నీరు వత్తిడి ద్వారా ప్రక్కనే ఏర్పాటు చేసిన ఒక నాన్ రిటర్న్ వాల్ ఏర్పాటు చేసిన పైపు ద్వారా పైకి వెల్తాయి. అలా వెళ్లి సమీపంలో ఒడ్డున 40 నుంచి 60 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన పైపులోకి నీరు తోడుతూ వుంటాయి ఈ పిస్టన్‌లు. ఒడ్డున ఏర్పాటు చేసిన పైపు నుండి క్రిందకు వచ్చిన నీరు 300 అడుగుల దూరం అయినా సునాయాసంగా (గ్రావిటీ మీద) పారుతూనే వుంటుంది. పిస్టన్‌ల నుండి పైపు పైకి వెళ్ళే నీటి పైపు రెండున్నర అంగుళాలు వుంటుంది. ఎత్తుగా ఏర్పాటు చేసిన పైపు ద్వారా పొలానికి వెళ్ళే నీరు 3 లేదా 4 అంగుళాల పైపు ద్వారా వెళుతుంది. నదిలో నీటి లభ్యతను, రైతు అవసరాన్ని బట్టి కావలసినంత సైజులో ఈ ర్యాంపంపు ఏర్పాటు చేసుకోవచ్చు.

ఇలా ఏర్పాటు చేసిన విధానాన్నే 'ర్యాం పంప్' అంటారు. ఈ పద్ధతిని ఏర్పాటు చేసుకోవటానికి అవసరాన్ని బట్టి 2.5 నుండి 3.5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. దీన్ని ఒక్కసారి ఏర్పాటు చేసుకుంటే చాలు ఇక ఎటువంటి ఇంధనం, శ్రమ, కరెంటు అవసరం లేకుండా నిరంతరా యంగా నీరు పారుతునే ఉంటుంది. ఒకవేళ నీరు అవసరం లేదు అనుకుంటే నదిలో ఏర్పాటు చేసిన పిస్టన్‌లను కొద్దిసేపు పైకి లేపి పట్టుకుంటే చాలు పిస్టన్‌లు పని చేయటం ఆగిపోతాయి. మళ్ళీ నీరు కావాలి అనుకున్నపుడు పిస్టన్‌ను క్రిందకు అదిమి ఉంచితే చాలు మళ్ళీ నీరు పారటం మొదలవుతుంది. ఈ పిస్టన్‌లకు ఆయిల్ సీల్స్ లాంటి విడిభాగాలు ఏవీ ఉండవు కనుక నర్వహణా కర్చులు కూడా చాలా తక్కువగా ఉంటాయి.





ర్యాం పంప్ ఏర్పాటు

పల్లం దిశగా పొలంలో పారుతున్న నీరు

విద్యుత్ సౌకర్యం లేనిచోట, పొలం సమీపంలో సహజంగా ఎత్తు నుండి నీరు పారే జలపాతం లాంటివి వున్న రైతులు ఇలాంటివి ఏర్పాటు చేసుకున్నట్లయితే ఎలాంటి నిర్వహణా ఖర్చులు అవసరం లేకుండా ఉచితంగా నీరు పారించుకోవచ్చు. కనీసం 8–10 అడుగుల ఎత్తునుండి నీరు పారేచోట మాత్రమే దీన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ పంపు ద్వారా నిమిషానికి 300 నుండి 350 లీటర్ల నీటిని తోడుకోవచ్చు. అంటే రోజుకు 4 నుండి 5 లక్షల లీటర్ల నీటిని ఎటువంటి ఖర్చు లేకుండా తోడుకోవచ్చు. రైతు అవసరాన్ని, పొలం ఎత్తును అంచనా వేసి నది ఒడ్డున ఏర్పాటు చేసే పైపు ఎత్తు, నీటి అవసరాన్ని బట్టి పైపు కొలతలు మార్చటం ద్వారా ఈ పంపును ఏర్పాటు చేస్తారు. ఈ పంపు చేసే నీటికి డ్రిప్పు సౌకర్యం ఏర్పాటు చేసుకున్నట్ల యితే 20–25 ఎకరాల పొలాన్ని సునాయాసంగా సాగు చేసుకోవచ్చు. కాలువల పద్ధతి ద్వారా నీరు పారించినా 10 ఎకరాలకు పైగా ఎటువంటి నీటి ఖర్చు లేకుండా పంటలు పండించుకోవచ్చు. ఒక్కసారి పెట్టుబడి పెడితే చాలు ఎన్నో సంవత్సరాల పాటు పంటలు పండించుకోవచ్చు.

ఎంతో నిష్ణాతులైన ఇంజనీర్లు ఏర్పాటు చేసే ఇలాంటి 'ర్యాం పంపు'ను కేవలం ఐటిఐ వరకు మాత్రమే చదువుకున్న శ్రీనివాస్ తయారు చేసినందుకు ఆ గ్రామ ప్రజలు, సమీప గ్రామాల రైతులు, వ్యవసాయ అధికారులు, ప్రజా నాయకులు అభినందిస్తున్నారు. ఇప్పటికే శ్రీనివాస్ ఏర్పాటు చేసిన 5–6 ర్యాం పంపులు నిరంతరాయంగా రైతుల పంటలకు నీరు అందిస్తున్నాయి. వీటి నిర్మాణంలో సిడిఆర్ సంస్థ పూర్తి సహకారాలను అందిస్తోంది. ఈ పంపును ఏర్పాటు చేయటం కొరకు శ్రీనివాస్ కనీసం వారం పది రోజుల పాటు శ్రమించాల్సి వుంటుంది.

**'హైడ్రో లిఫ్టింగ్ పద్ధతి' తయారు చేసి విజయవంతంగా ప్రదర్శన:**

'ర్యాం పంపు' తయారు చెయ్యాలంటే జలపాతం కనీసం 4 నుండి 6 అడుగుల పై నుండి క్రిందకు పారే చోట మాత్రమే ఏర్పాటు చెయ్యగలము అని తెలుసుకున్నాడు శ్రీనివాస్. అలాంటి జలపాతాల ఎన్ని ఉన్నాయో కనుగొనటానికి కొన్ని వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించి చూశాడు. ఇలాంటి ఎత్తు ఎక్కువ నుండి పారే జలపాతాలు 10 నుండి 15 కిలోమీటర్లకు ఒకటి చొప్పున మాత్రమే ఉన్నాయని తెలుసుకున్నాడు. కానీ, ఇక్కడ మరో విషయం గమనించాడు. అదే మార్గంలో కనీసం 4 నుండి 6 అడుగుల ఎత్తు నుండి పారే జలపాతాలు ప్రతి ఒకటి రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. ఇటువంటి చోట ర్యాం పంపు ఏర్పాటు చేయటం కుదరదు. దీనికి మార్గం ఏమిటా అని ఆలోచిస్తూ కాకినాడకు వెళ్తున్న సమయంలో అతనికి నగర శివారుల్లోని గోదాముల పై కప్పు పైన కొన్ని చక్రాలు తిరుగుతూ కనిపించాయి. అవి లోపలి గాలిని బయటకు పంపే 'ఎగ్జాస్ట్' ఫ్యాన్‌లు కొత్త పద్ధతిలో వచ్చాయేమో అనుకున్నాడు. అవి కూడా కరెంటు ద్వారా పని చేస్తుంటాయిలే అనుకుని, సరే చూద్దామని అక్కడి వెళ్ళి చూడగా, వాటికి ఎటువంటి విద్యుత్ మోటార్ అవసరం లేకుండా కొంత వరకు వేగంగానే తిరుగుతూ కనిపించాయి. ఇవి ఎలా పని చేస్తున్నాయా? అని నిశితంగా గమనించి చూశాడు. అప్పుడు అర్థమైంది అతనికి ఆ ఫ్యాన్లకు ఏర్పాటు చేసిన బ్లేడ్లు చాలా తేలికైనవి, పైగా ఎక్కువ వెడల్పు లేకుండా ఉన్నాయి అని తెలుసుకున్నాడు. ఇదేదో తన ప్రయోగానికి పనికి వచ్చేలా ఉన్నాయే అని ఆలోచించి, ఒక ప్రయోగానికి పూనుకున్నాడు.

నమూనా యంత్రం తయారీ చెయ్యాలి అనుకున్నాడు. మూడు అడుగుల పొడవు, ఒక అడుగు వ్యాసార్థం గల ఒక చక్రాన్ని తయారు చేసుకున్నాడు. దానికి కేవల ఒక అంగుళం వెడల్పు ఉన్న పలుచని రేకులతో ప్రతి అంగుళానికి ఒకటి చొప్పున ఏటవాలుగా వాటిని అమర్చాడు. అలా మూడు అడుగుల పొడవు గల ఒక చక్రాన్ని తయారు చేసి, దానికి ఒక బాక్సు ఏర్పాటు చేశాడు. పైనుండి పడే నీరు ఆ బాక్సుకు ఏర్పాటు చేసిన మార్గం ద్వారా లోపలికి వచ్చిన నీరు ఈ చక్రంపై పడటం వల్ల ఆ వేగానికి చక్రం వేగంగా తిరగటం మొదలు పెట్టింది. ఈ వేగానికి అనుగుణంగా సూక్ష్మమైన శక్తితో కూడా తిరిగేలా కేవలం బుష్‌ల ద్వారా ఆ చక్రానికి ఒక పుల్లీ ఏర్పాటు చేసి, దానికి ఒక చక్రాన్ని ఆ చక్రానికి ఒక రబ్బర్ బెల్టులు తగిలించి, ఆ బెల్టు మరో వైపు ఒక చిన్న నీటిని తోడే ఇంఫైలర్‌ను తిరిగేలా చేశాడు. చక్రం తిప్పి బైటకు వచ్చే నీటిని ఒక పైపులోకి వచ్చేలా చేసి, ఆ నీరు ఇంపెలర్ ద్వారా ఎత్తుకు పంపేలా చేశాడు.

ఈ ప్రయోగాన్ని ఇటీవల (2024 అక్టోబర్ 25–27 వరకు) జరిగిన 50వ చిన్న శోధయాత్రలో పాల్గొన్న యాత్రీకులకు ప్రయోగాత్మకంగా చూపించాడు. అతని ప్రయోగం విజయవంతం అయింది. ఇప్పుడు ఇటువంటి 'హైడ్రో లిఫ్టింగ్' పద్ధతిలో నీరు తోడేలా చెయ్యాలంటే ప్రభుత్వం లేదా ఏవైనా గిరిజనులకు సహాయ సహకారాలు అందించే










స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సి ఉంది. ఈ హైడ్రో లిఫ్టింగ్ పద్ధతిని పెద్దయెత్తున తయారు చేసేందుకు ప్రణాళికను కూడా సిద్ధం చేసుకున్నాడు.

చక్రంపైన పడే నీరు చక్రాన్ని తిప్పుతుంది, ఆ చక్రం వేగానికి ప్రక్కన ఏర్పాటు చేసిన ఇంఫైలర్‌ను కూడా తిప్పుతుంది. ఇంఫైలర్ తిరగటంతో చక్రంపైన పడే నీటిని బయటకి తోడేస్తుంది. ఇలా తోడే నీరు తాను చేసిన కేవలం నమూనా యంత్రం ద్వారానే 20 అడుగుల వరకు తోడింది. 45 అడుగుల ఎత్తు వరకు నీరు లేపగలమని శ్రీనివాస్ తెలిపారు.

ఈ హైడ్రో లిఫ్టింగ్ ద్వారా 100 ఎకరాల వరకు నీరు, నదుల – వాగుల ఇరు ప్రక్కల ఎత్తుపైన ఉండే భూముల సాగు కొరకు సునాయాసంగా వాడుకోవచ్చు. ఇంధన ఖర్చు లేకుండా, సంపూర్ణ పర్యావరణ రక్షణతో సహజంగా సవత్సరాంతం లభించే నీటిని ప్రజలకు సౌలభ్యంగా వాడే అవకాశం కల్పించిన "శ్రీనివాస్ హైడ్రాలిక్" పద్ధతి ఒక వినూత్న సమాజ మిత్ర ఇన్నోవేషన్. వీటిని ఏర్పాటు చేస్తే వాటి రిపేర్లను కూడా గిరిజనులే స్వయంగా చేసుకో గలరు. ఇందులో శిక్షణ పొందిన మెకానిక్ వచ్చి రిపేరు చేయాల్సిన అవసరం లేదు కనుక ఇటువంటి పంపుల ద్వారా నిరంతరాయంగా నీటిని అందివ్వటంతో పాటు, ఆ కుగ్రామాలకు విద్యుత్‌ను కూడా అందించవచ్చు. దీన్ని విస్తరింపజేయడానికి అన్ని వర్గాలు ముందుకు రావాలని 'పల్లెసృజన' మనసారా కోరుకుంటోంది.

ప్రవహించే నదుల నీటి ప్రవాహంతో నిరంతర విద్యుత్తు కూడా ఉత్పత్తి చేసి, స్థానిక ప్రజలకు విద్యుత్ సరఫరా చేయవచ్చు. దీనికై శ్రీనివాస్ ఒక వినూత్న ఆవిష్కరణ తయారు చేశాడు. అమలులో పెట్టడానికి అయనకు సహాయం అవసరం.



గిరిజన ప్రాంతాలకు వెలుగులు నింపాలి, ఆ ప్రాంత రైతులు మంచి పంటలు పండించుకోవాలి అని కోరుకునే స్వచ్ఛంద సంస్థలు, గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ప్రభుత్వాలు ఇటువంటి వాటిని ఏర్పాటు చేయించటం ద్వారా గిరిజన ప్రాంతాలు సర్వతోముఖ అభివృద్ధిని సాధించుకుంటాయి అనటంలో ఎలాంటి సందేహం లేదు.

కేవలం ఒక్కసారి పెట్టుబడి పెట్టడం ద్వారా కొద్దిపాటి నిర్వహణా ఖర్చులు ఆయా ప్రాంతాల వారే చేసుకోగలరు కాబట్టి ఇటువంటి హైడ్రో లిఫ్టింగ్ పద్ధతులను సంస్థలు, ప్రభుత్వాలు ముందుకు రావాలని కోరుకుంటోంది పల్లెసృజన. ఈ విషయంలో సహాయ సహకారాలు అందించటానికి 'పల్లెసృజన' ఎప్పుడూ మీకు సహాయకారిగా ఉంటుంది.

**ఇన్నోవేటర్ శ్రీనివాస్ ఫోన్ నెంబర్ : 7989599512**



# పల్లె జ్ఞానం

- హనీబీ ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

**రెండుసార్లు నాటు వేయటం ద్వారా 'క్యాబేజి, క్యాలీఫ్లవర్' పంటల అధికోత్పత్తి:**

ఒరిస్సాలోని సుందర్‌ఘర్ ప్రాంతం లోని స్థానిక కొండ జాతి వారు క్యాలిఫ్లవర్, క్యాబేజీ పంటల అధికోత్పత్తికి ఈ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. ముందుగా విత్తనాలను నారుమడిలో పోసి మారాకులు మొలకెత్తిన తర్వాత ఆ మొలకలను జాగ్రత్తగా తీసి ఇంకొక మడిలో నాటాలి. అక్కడ మొక్కకి దాదాపు ఎనిమిది ఆకులు వచ్చేవరకు ఉంచాలి. ఆ తర్వాత వాటిని తీసి పొలంలో నాటినచో ఆ మొక్క బలంగా, ఆరోగ్యంగా ఉండటంతో పాటు, అధికోత్పత్తిని ఇస్తుంది. షెడ్యూల్డు తెగలకు చెందిన రైతు గణనాథ గత ఐదు సంవత్సరాలుగా ఈ పద్ధతిని ఉపయోగించి అధికోత్పత్తిని సాధించాడు.



**నిమ్మజాతికి చెందిన దబ్బ(కర్ణ) కాయ చెట్ల ఆకులతో పశువులలో నులిపురుగుల నివారణ:**

ఒరిస్సా రాష్ట్రంలోని పూరి, అంగూల్, కలహాంది ప్రాంతాల్లోని ప్రజలు దబ్బ (కర్ణ) కాయలను ఆహారంలో వాడుతారు. కానీ లక్ష్మీబెన్ (49 సం.) ఈ చెట్ల ఆకులను పశువులలో నులి పురుగుల నివారణకు వాడుతుంది. ఆమె మూడు నాలుగు ఆకుల రసానికి కొద్దిగా ఉప్పు కలిపి 150 మి.లీ. నీటిలో కలిపి జ్యూస్‌ను తయారు చేసి పశువులకు తాగిస్తుంది. దీంతో పశువుల కడుపు శుభ్రపడి కడుపు నొప్పితో పాటు నులి పురుగులు కూడా నివారించబడతాయి. ఈ పద్ధతిలో ఈమె ఎన్నో దూడలకు వైద్యాన్ని చేసింది.



**కాకర ఆకుల రసంతో పశువుల పుండ్లకు వైద్యం:**

పశువులకు దెబ్బలు, పుండ్లను అలాగే వదిలేస్తే అవి చీము పట్టి సెప్టిక్ అయ్యే ప్రమాదముంది. ఒరిస్సాలోని తర్చర్ అనే గ్రామ ప్రజలు తాజా కాకర ఆకులను దంచి ఆ ముద్దను పశువుల పుండ్లు, గాయాలపై పూయటం ద్వారా అవి త్వరగా మానిపోవటం జరుగుతోంది. దీనివలన గాయాలు త్వరగా మానటమే కాకుండా, క్రిమి కీటకాలను కూడా చేరనివ్వకుండా నిరోధిస్తుంది. ముద్దగానే కాకుండా కాకర ఆకులను చేతితో నలిపి ఆ రసాన్ని గాయంపై వేస్తే కూడా బాగా గుణం కన్పిస్తుంది. ప్రకాష్ అనే రైతు ఈ పద్ధతిలో చాలా పశువులకు ఉపశమనం కలిగించాడు.



**పత్తి, కూరగాయల పంటలలో చీడల నివారణకు:**

పత్తి, ఏ కూరగాయల పంటలలోనైనా చీడ పట్టకుండా తాను చాలా సులువైన పద్ధతిని వాడుతున్నానని గుజరాత్ రాష్ట్రంలోని జూనాఘడ్ జిల్లా, మాల్యా తాలూకా నివాసి గీతాబెన్ కాంతిలాల్ సోలంకి చెప్తున్నారు. ఈమె తేలుకొండి కాయ ఆకులు, వేర్లను సేకరించి, నీడలో బాగా ఆరనిచ్చి, వాటిని పొడిచేసి, నీటిలో కలిపి ప్రత్తి పంట, కూరగాయల పంటలపై పిచికారి చేస్తుందట. తాను 10 మీటర్ల చదరం గల పంటకి 500 గ్రా. పొడిని వాడుతానని చెపుతున్నారు. ఈ పద్ధతి వాడటం ప్రారంభించిన తర్వాత తన పత్తి, కూరగాయల పంటలలో చీడ పట్టడం బాగా తగ్గిపోయిందని చెపుతున్నారీమె.




**పొలంలో ఎలుకల నివారణకు మూలికలతో మందు:**

పొలాల్లో ప్రత్యేకించి ధాన్యం పండించే పొలాల్లో ఎలుకల బెడద ఎక్కువ. అవి పంటకు చాలా నష్టం కలుగజేస్తుంటాయి. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ జిల్లా, ఉమర్‌పాడ తాలూకా నివాసి 'కన్సర్‌భాయ్ గజలాభాయ్ చౌదరి' తాను ఎలుకల బాధనుండి తప్పించుకోవటానికి మూలికలు వాడుతా నని చెపుతూ తన పద్ధతిని ఈవిధంగా వివరించారు. ఆయన గచ్చకాయ గింజలు, ఇప్ప విత్తనాలు, జొన్న లు కలిపి పొడిచేసి, తగినంత నీటిని చేర్చి చిన్న చిన్న గులికలు గా తయారు చేస్తానని, ఈ గుళికలను ఎలుక బొర్ర లలో ఉంచుతానని, ఈ గులికల వాసన, రుచి నచ్చక ఎలుకలు పారిపోతాయని, తానీ పద్ధతి చాలా సంవత్సరాల నుంచి వాడుతున్నానని చెపుతున్నారు.

**ధాన్యం నిలువకి బిరియాని ఆకు:**

బీహార్ రాష్ట్రంలోని బక్సద్ జిల్లా, మొహల్లా సోనయ్‌పట్టి ప్రాంత నివాసి 'మురళీ శరణ్ సింఘు' ధాన్యం నిలువకి బిర్యాని ఆకు వాడుతానని చెప్తున్నారు. పప్పులు, ధాన్యం నిలువ చేయటానికి ముందు వెదురు గుమ్మిలో క్రింద బిర్యాని ఆకులు వేసి, వాటిపై ధాన్యాన్ని పోసి మళ్ళీ ఒకసారి మధ్యలో ఆకులు వేసి, ఆపైన మళ్ళీ ధాన్యం వేసి, పై భాగంలో మళ్ళీ బిర్యాని ఆకులు పరిచి నిలువ చేస్తే ధాన్యాన్ని 7 నుండి 8 నెలల వరకు సురక్షితంగా కాపాడుకోవచ్చు అని చెపుతున్నారీయన. ఈ పద్ధతిలో ప్రత్యేకత ఏమిటంటే బిర్యాని ఆకు (తేజ్ పత్తా)ని వంటలో వాడిన తర్వాత కూడా శుభ్రం చేసి ఎండబెట్టి ధాన్యం నిలువ చేయటానికి వాడుకోవచ్చు.





## సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత 18 సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. అంతే కాక పునాది స్థాయి ఇన్నోవేషన్లు ఎన్నో అందుబాటులోకి రావటం, గ్రామాల్లోనే ఎంతోమందికి ఉపాధి లభించటం జరిగింది.

గత 18 యేళ్ళ ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం. ఈ ప్రయత్నంలో మీ సమస్యలను మీవద్దనుండి సేకరిం చాలని నిర్ణయించుకున్నాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము.

చుట్టూ ఉన్న సమాజంలోని కష్టాలను గమనించండి. ఆ కష్టాలను సంపూర్తిగా అవగాహన చేసుకొని వాటి నివారణకై సమాజంలో చర్చలు జరపండి. సరియైన పరిష్కారాన్ని ఇన్నోవేట్ చెయ్యండి. అది ప్రజలకు అందు బాటులో ఉండేట్లుగా, అవసరానికి తగ్గట్లుగా, వైవిధ్యానికి వాతావరణానికి తోడు చేసేట్లుగా ఉండాలి. ఇలాంటి ఇన్నోవేషన్లు ప్రజలకు చేరిస్తే ఈ దేశం నిజమైన ఆత్మ నిర్భరత ను సాధిస్తుంది. మీకు ఎటువంటి సాంకేతిక పరమైన అవసరాలున్నా'పల్లెసజన' ను సంప్రదిం చడానికి సంశయించకండి. సమస్య పరిష్కారానికి మీ ఆలోచనను తెలియజేసినా, అది కార్యరూపం దాల్చేలా చేద్దాం. -పల్లెసృజన.

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866 00 1678, వీరరాఘవ రెడ్డి: 81257 99904 / 79890 38186

# 'పల్లెసృజన' ఇన్నోవేటర్ మహిపాల్ చారి కి
# "అమేజింగ్ ఇండియన్" పురస్కారం










తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ రూరల్ జిల్లా, పర్కాలకు చెందిన కడివెండి మహిపాల్ చారి పల్లెసృజన పాఠకులకు చిరపరిచితుడే ఇతను మొట్టమొదట చేసిన పవర్ వీడర్, ఆ తర్వాత చేసిన గ్రామాలకు, పట్టణాల్లోని గోదాములకు తప్పనిసరిగా అవసరమైన ట్రాక్టర్ అటాచ్ మెంట్ క్రేన్, ఇప్పుడు చేసిన ఎలక్ట్రిక్ ట్రాలీ తయారు చేసిన ఇన్నోవేటర్ కూడా మహిపాల్ చారే.

2013 జనవరి – ఫిబ్రవరి సంచికలో మొట్టమొదటిసారిగా మహిపాల్ చారి తయారు చేసిన వీడర్ గురించి ప్రచురించడం జరిగింది. నాడు మొదలైన ఇతని ఇన్నోవేషన్ అతని నిరంతర కృషి వల్ల నేడు పల్లెసృజన ఇన్నోవేటర్లలో అత్యధిక యంత్రాలను తయారు చేసి, రైతాంగానికి అందించిన వారిలో ఇతనే మొదటి స్థానంలో ఉన్నాడు. తన గ్రామంలోనే తయారీ సంస్థను ఏర్పాటు చేసుకుని, అక్కడి స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వటంతో పాటు, ఆ గ్రామం నుండే ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశంలోని చాలా రాష్ట్రాలకు ఇతని వీడర్లు ఎగుమతి అవుతున్నాయి.

ఆగస్టు 24, 2024న న్యూ ఢిల్లీలో ట్రైబ్స్ నెట్‌వర్క్ ద్వారా 'అమేజింగ్ ఇండియన్స్ అవార్డ్ – 2024' ఇన్నోవేటర్ మహిపాల్ ను వరించింది. ఈ కార్యక్రమానికి పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి 'కిరణ్ రిజిజు' ముఖ్య అతిథిగా హాజయ్యారు. మహిపాల్ చారి టెక్నాలజీ ఉపయోగించి కల్టివేటర్‌ను తయారు చేసి, వ్యవసాయంలో కార్మికుల కొరత సమస్యకు పరిష్కాలు అందించడం లక్ష్యంగా పెట్టుకొని ఇతర పరికరాలు చేసినందుకు ఈ పురస్కారం అందించడం జరిగింది. 'పల్లెసృజన' కుటుంబంలో "అమేజింగ్ ఇండియన్" పురస్కారం అందుకున్న రెండవ ఇన్నోవేటర్. 2016 జనవరి, 14న మొట్టమొదటి సారిగా మన ఇన్నోవేటర్ 'చింతకింది మల్లేశం' ప్రధాని నరేంద్ర మోడీ చేతులమీదుగా ఇదే 'అమేజింగ్ ఇండియన్' పురస్కారం అందుకోవడం జరిగింది.

మహిపాల్ చారి ఈ పురస్కారాన్ని అందుకోవటం 'పల్లెసృజన' కుటుంబం ఎంతో ఆనందంగా భావిస్తోంది. సమాజంలోని రైతులతో పాటు ఇతరులకు కూడా తాము చేస్తున్న పనిలో శ్రమను, ఖర్చును తగ్గించే ఇన్నోవేషన్‌లను తయారు చేస్తున్న మరింత మంది ఇన్నోవేటర్లకు ఇలాంటి పురస్కారాల ద్వారా తాము ఇంకా ఆనందంగా ముందుకు సాగి, మరిన్ని ఇన్నోవేషన్లను సమాజానికి అందించేందుకు ప్రోత్సాహాన్ని ఇస్తుందని నమ్ముతోంది పల్లెసృజన.

ట్రైబ్స్ నెట్ వర్క్ అమేజింగ్ ఇండియన్స్ ఈవెంట్ ద్వారా వారి సంవేదన, కరుణ, అంకిత భావం మరియు దాతృత్వం ద్వారా తమ చుట్టూ ఉన్న వారి జీవితాలను మార్చడం ద్వారా ప్రపంచాన్ని మార్చే వారిని గౌరవిస్తూ ఇలాంటి పురస్కారాలను అందజేస్తోంది. ఇది భారత దేశం అంతటా గుర్తింపుకు నోచుకోని హీరోల (అన్‌సంగ్డ్ హీరోస్) స్ఫూర్తి దాయకమైన కథలను వెలుగులోకి తెచ్చే వేదిక.

మహోన్నత వ్యక్తుల ద్వారా ఇన్నోవేటర్ కడివెండి మహిపాల్ చారి 2024 సంవత్సరానికి "అమేజింగ్ ఇండియన్" పురస్కారం అందుకోవటం 'పల్లెసృజన' కుటుంబ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి కావటం ఒక పండుగ. బహుశా ఒకే సంస్థ (పల్లెసృజన) నుండి ఇద్దరు ఇన్నోవేటర్లు (చింతకింది మల్లేశం, కడివెండి మహిపాల్ చారి' అమేజింగ్ ఇండియన్స్ కావడం మన పల్లెసృజనకు మాత్రమే దక్కిన అరుదైన గౌరవం కావచ్చు. ఈ సందర్భంగా మహిపాల్ చారికి, ఆయన కుటుంబానికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తోంది పల్లెసృజన. ●



## భీమలింగేశ్వరం గారి వినూత్న, విజయవంతమైన వ్యవసాయ ప్రయోగం

# 25% పెట్టుబడితో 100% ఆముదపు పంట

- వీరరాఘవ రెడ్డి

కర్నాటక లోని విజయనగర జిల్లా హొస్పేటకు చెందిన రైతు, విశ్రాంత ప్రొఫెసర్ భీమ లింగయ్య గారు వ్యవసాయంలో తాను ఆచరించిన విధానాన్ని గురించి 'పల్లెసృజన' పాఠకులకు తెలియజేశారు. వీరు అనంతపురం జిల్లా, బెళుగుప్ప మండలం లోని దుద్దేకుంట గ్రామంలో తనకున్న పొలంలోని 12 ఎకరాలలో జూన్ 18న, ఎకరానికి 3 కిలోల చొప్పున ఆముదం విత్తనాలు నాటాడు. ఈ విత్తనాలను తమ ఊరిలోనే కొందరు రైతుల వద్ద ఉన్న మూడు నాలుగు రకాల మంచి విత్తనాలను సేకరించి విత్తడం జరిగింది. ఈ సంవత్సరం వర్షాలు కూడా అనుకూలంగా రావడంతో ప్రతి చెట్టు మూరెడు పొడవున్న గెలలు వేశాయి. ఆముదము విత్తనం కూడా దృఢంగా వచ్చింది. భూమిలో ఆయన రసాయన ఎరువులు వేయక పోవడంతో భూమి మెత్తగా ఉండటం గమనించాడు భీమలింగయ్య. పంట వేసిన తర్వాత ఒక నెల 10 రోజులు వర్షం లేకపోయినా, మరలా పడ్డ మంచి వర్షాల వల్ల మొక్క 4 అడుగుల ఎత్తు వరకు పెరిగింది. పొలంలో ఉన్న ప్రతి మొక్క ఒక గెల వేసింది. పంట సుమారు మోకాటి ఎత్తు వరకు ఉన్నపుడు ట్రాక్టరుతో రెండుసార్లు అంతర సేద్యం చేయించాడు.



అంతర సేద్యం చేయటానికి ముందే పొలమంతా 'మూడాకుల తీగ' వ్యాపించింది. భూమి తేమగా ఉన్నపుడు పాపనం (అంతర సేద్యం) పాయటం వల్ల గడ్డి మట్టిలో కలిసిపోయి అది పచ్చిరెట్ట ఎరువుగా మారి, ఎక్కడికక్కడ మట్టిలో కుళ్ళిపోయి ఆముదము మొక్కలకు అందింది. అప్పుడు అనిపించింది ఆయనకు ఎర్ర నేలలో కూడా అద్భుతాలు చేయవచ్చు అని. ఊర్లోనే మంచి విత్తనాలను సేకరించి వేయటం వలన విత్తనానికి రూ. 15 వేల వరకు అయ్యే ఖర్చు కేవలం 2 వేల రూపాయలే అయ్యింది. ఈ అక్టోబర్ 2వ వారంలో మొదటి కోత విత్తనాలు కోయగా 15 క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. ఆముదము పంట సంవత్సరానికి కేవలం వర్షాధారంగా వేసినా, 5 నుండి 6 వరకు కోతలు వస్తాయి అన్నారు. అంటే ఈ లెక్కన ఎకరాకు ఒకటిన్నర క్వింటాళ్ళ ఆముదం దిగుబడి ప్రకారం లెక్క వేసినా, సంవత్సరానికి 7 నుండి 8 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది అని నిరూపిస్తున్నారు భీమలింగయ్య.

సెప్టెంబర్ 25న ఉత్తరా కార్తె చివరలో 'హస్త' కార్తెలో మొలిచేలా 20 ఎకరాల ఎర్రనేలలో ఎకరానికి 3 కిలోల చొప్పున 'ఉలవలు' వేశారు. 'హస్త కార్తెలో హస్తం నిండ పంట' అన్న నానుడిని అనుసరించారు భీమలింగయ్య గారు. చివర్లో అయితే గడ్డి చాలా వరకు తగ్గుతుందని, ఉలవ కూడా తీగ లేకుండా మంచి కాపు ఇస్తుందని ఈ సమయాన్ని ఎంచుకున్నాడు. తక్కువ వర్షంలో పండే పంటలను ఎంచుకుని ఖర్చు తగ్గించుకో గలిగితే లాభాలు కూడా పెరుగుతాయని భావించాడు. పైరు మార్పిడి తప్పనిసరిగా చేస్తే సత్ఫలితాలు వస్తాయని ఆయన అనుభవంలో తెలుసుకున్నాడు.

ఒక టీవీ ప్రోగ్రాంలో బ్రిగేడియర్ గణేశం గారి కార్యక్రమాన్ని చూసి, వారిని ఫోన్ ద్వారా కలిసి, మీరు చేస్తున్న కార్యక్రమాల్లో తాను చురుకుగా ఉండాలన్న ఉద్దేశ్యంతో తాను చేసిన ఈ కార్యక్రమాన్ని రైతులకు తెలియజేయాలని ఈ విషయాలను వెల్లడించారు. 'పల్లెసృజన' పత్రిక ద్వారా భీమలింగయ్య గారు రైతులకు తెలియజేస్తున్న విషయం ఏమిటంటే, రైతులు అనవసరంగా విత్తనాల ను మార్కెట్‌లో కొనుగోలు చేసి, వేలాది రూపాయలు వెచ్చించ వద్దని, కలుపును పూర్తిగా తొలగించడం కన్నా ఆ కలుపు మొక్కలు పొలం లోని మట్టిలో కలిసిపోయేలా చేస్తే అవే పంటకు ఎరువుగా మారుతాయని, అనవసరంగా వేలాది రూపాయలు వెచ్చించి, రసాయన ఎరువులు వేయాల్సిన అవసరం కూడా లేదని నిరూపించారు.

టీవీ ప్రోగ్రాంల ద్వారా కూడా 'పల్లెసృజన' కార్యక్రమాలకు ముగ్ధులై తాము కూడా ఆచరిస్తూ, ఈ విషయాలను మన పత్రిక ద్వారా అందించాలన్న భీమలింగయ్య గారిని అభినందిస్తూ మరింత మంది రైతులు ఈ ప్రయోగాన్ని చేపడతారని, వ్యవసాయంలో నష్టాలకు గురికాకుండా, మంచి దిగుబడిని తక్కువ ఖర్చులో సాధించాలని కోరుకుంటోంది పల్లెసృజన. ●

**రైతు భీమలింగయ్య, ఫోన్ : 9866302717**

National Innovation Foundation-India

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

## జాతీయ 14 వ ద్వైవార్షిక పోటీలు

పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు



**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 14వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

### ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు** గొప్ప ఇన్నోవేటర్‌కు **లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును.** అంతే కాదు **ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో** ఎన్నుకోబడిన **ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.**

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2025** లోగా మాకు చేరేలా పంపండి.

### దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**

**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫొటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**

**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**

**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**

**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

## దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2025

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా **'పల్లెసృజన'** కార్యాలయాన్ని (**ఫోన్ : 040–40253096**) సంప్రదించండి.

# ఎన్.ఐ.ఎఫ్. వారి ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ (ఫైన్ – 2023) పురస్కారాలు




ఎన్.ఐ.ఎఫ్. వారి జాతీయ ద్వైవార్షిక పునాది స్థాయి ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో విజేతలకు భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్ము, న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 10 నుండి 13, 2023 వరకు రాష్ట్రపతి భవన్ లోనే జరిగిన "ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఫైన్ – 2023)" ప్రదర్శన నిర్వహించడం జరిగింది. అందులో బహుమతులు పొందిన అనేక మంది ఇన్నోవేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతులు పొందిన కొందరి వివరాలను ఈ క్రింద పొందుపరుస్తున్నాము.

**చెట్ల వేర్లను పెకిలించి తీసే పరికరం**

జాతీయ 2వ బహుమతి

**ఇంద్రజిత్ సింగ్ ఖాస్ (47)**

ఔరంగాబాద్, మహారాష్ట్ర



పేపరు పరిశ్రమలకు అవసరమయ్యే నీలగిరి చెట్లు, ఇళ్ళ నిర్మాణ అవసరాలకు అవసరం అయ్యే సరుగుడు చెట్లు, సుబాబుల్ వంటి చెట్ల పెంపకం చేబడుతూ ఉంటారు కొందరు రైతులు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా సాధారణ ఆహార పంటలను పండించలేని కొందరు రైతులు ఇటువంటి చెట్లను పెంచటం వల్ల చాలా తక్కువ కూలీలు, కష్టపడాల్సిన అవసరం లేకుండా ఉండేందుకు ఇటువంటి పంటల వైపు మొగ్గు చూపుతుంటారు కొందరు ఎక్కువ కమతాలున్న రైతులు. ఇటువంటి చెట్ల పెంపకం పూర్తయిన తర్వాత, వాటిని భూమి పైభాగం వలరకు కొత కోసి మార్కెట్‌లో అమ్ముకుంటూ ఉంటారు. ఈ చెట్ల మూలాలు పొలంలో 8 నుండి 10 అంగుళాల లోతు వరకు వెళ్ళి ఉంటాయి. ఆ పొలంలో పంట కోసిన తర్వాత భూమిలో మిగిలిపోయిన చెట్ల మూలాలు, చెట్ల వేర్లను తీసివేయాలంటే జెసిబిలను వినియోగించి తీసివేయటం ప్రస్తుతం జరుగుతున్న తంతు. ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది.

ఇలా చెయ్యటానికి ప్రస్తుతం అయ్యే ఖర్చులో కేవలం పావు వంతు ఖర్చుతో చేసేలా ఒక ట్రాక్టర్ అనుసంధాన పరికరాన్ని తయారు చేశాడు మహారాష్ట్ర లోని ఔరంగాబాద్‌కు చెందిన 47 సంవత్సరాల ఇంద్రజిత్ సింగ్ ఖాస్ అనే వ్యక్తి. ఇతను ఈ పరికరాన్ని తయారు చేయటానికి అతను ప్రస్తుతం చేసిన ఈ పరికరాన్ని చెట్టు మొదళ్ళను పట్టుకోవడానికి అనువుగా రెండు చేతులు లాంటి ఇనుప కొయ్యలు ఉంటాయి. ఒక చేయి స్థిరంగా ఉంటే, మరో చెయ్యి ట్రాక్టర్ హైడ్రాలిక్ హొూస్‌పైపు సహాయంతో కదిలి వేరు మూలాన్ని తీసివేస్తుంది. ఈ పనంతా చెయ్యటానికి 30 హార్స్‌పవర్ ల శక్తి గల ట్రాక్టర్‌ను అవసరం



అవుతుంది. పొలంలో ఈ వేరు మూలాలను 8 అంగుళాల లోతు వరకు పెకిలించి తీసి వేస్తుంది. ఒక ఎకరం పొలంలో ఈ వేరు మూలాలను తీసివేయటానికి 3.5 లీటర్ల డీజిల్ ఖర్చుతో దాదాపు 10 గంటల్లో పూర్తి చేస్తుంది.

ఇంద్రజిత్ సింగ్ స్నేహితుడు తన పొలంలోని పంట మూలాలను వేర్లతో సహా తీసివేయటానికి జెసిబి వారిని కలవగా వారు 2 లక్షల రూపాయలు అవుతుంది అని చెప్పారు. ఈ విషయాన్ని తెలుసుకుని తన స్నేహితుడి సమస్యను పరిష్కరించడానికి ఒక యంత్రాన్ని తయారు చెయ్యాలి అనుకుని, నీకు నేనొక పరికరాన్ని తయారు చేసి ఇస్తాను అని దాని గురించి వివరించాడు. తన ఆలోచన ప్రకారం మొదటి ప్రయత్నంలోనే నమూనాను విజయవంతంగా తయారు చేయగలిగాడు. దాని బరువు దాదాపు 175 కిలోలు ఉంటుంది. దాన్ని తయారు చేయటానికి దాదాపు 80 వేల రూపాయల వరకు ఖర్చయింది.

ఈ యంత్రం యూకలిప్టస్ మరియు సుబాబుల్ (నది చింతపండు) వంటి కాగితపు చెట్లపై ప్రధానంగా వాడటం జరిగింది. ప్లైవుడ్ మరియు పెన్సిల్స్ కోసం ఉపయోగించే పోప్లమ్ వంటి ఇతర చెట్లపై కూడా పని చేస్తుందని ఇంద్రజిత్ ఖచ్చితంగా చెప్పాడు. రివర్సబుల్ నాగలి యొక్క హైడ్రాలిక్ సిలిండర్‌ను ఉపయోగించి, స్వంతంగా ఇలాంటి మిషన్‌ను తయారు చేసుకోవాలని అతను రైతులను ప్రోత్సహిస్తాడు.

ఇంద్రజిత్ వ్యవసాయ యంత్రాలను తయారు చేసే సీరియల్ ఇన్నోవేటర్. 2019 లో అతను రాష్ట్రపతి భవన్‌లో ఇన్నోవేషన్ స్కాలర్స్ ఇన్-రెసిడెన్స్ ప్రోగ్రాంలో 6వ బ్యాచ్‌లో పాల్గొన్నాడు.

రైతుల ఖర్చులను గణనీయంగా తగ్గించే ఇలాంటి ట్రాక్టర్ అనుసంధాన పరికరాన్ని తయారు చేసినందుకు గాను ఇంద్రజిత్ సింగ్ ఖాస్‌కు ఎన్ఐఎఫ్ వారు తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023వ సంవత్సరంలో జాతీయ స్థాయి ద్వితీయ బహుమతి ఇచ్చి సత్కరించారు.

### అభివృద్ధి చేయబడ్డ అధిక దిగుబడినిచ్చే SK-4 రకం పసుపు

జాతీయ 2వ బహుమతి

**సచిన్ కమలాకర్ కరేకర్ (43)**

రత్నగిరి, మహారాష్ట్ర.



మహారాష్ట్ర లోని రత్నగిరి ప్రాంతానికి చెందిన 43 సంవత్సరాల సచిన్ కమలాకర్ కరేకర్ అనే రైతు 26 సంవత్సరాల పాటు పరిశోధించి 160 నుండి 170 రోజుల్లో పక్వానికి వచ్చేలా, హెక్టారుకు 450 క్వింటాళ్ళ దిగుబడి వచ్చేలా 'ఎస్.కె.-4' అనే పసుపు రకాన్ని అభివృద్ధి చేశాడు. ఈ రకం పసుపు ఆకు తెగులు సమర్థవంతంగా ఎదుర్కొంటుంది. ఈ రకం పసుపుకు అతను 'ఎస్.కె-4' అని పెట్టడానికి నాలుగు రకాల 'ఎస్.కె.'లు కారణం. 1. అతని పేరు 'సచిన్ కమలాకర్' (ఎస్.కె.), 2. ఈ విత్తనాన్ని అతను తన గురువు గారైన 'సాంగ్లి జిల్లాకు చెందిన కాడప్ప' (ఎస్.కె.), 3. 'సెంగె కాక' (ఎస్.కె.) అనే వ్యక్తి ద్వారా ఇతను ప్రేరణ పొందాడు, 4. 'సావంత్




కొంకణ్' (యస్.కె.) కృషి విద్యాపీఠ్, దాపోలి సహకారంతో ప్రో-ట్రే విత్తే పద్ధతి ద్వారా ఈ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేశాడు. అందుకే కమలాకర్ తను అభివృదిక్ధ చేసిన విత్తనానికి 'ఎన్కె-4" అని నామకరణం చేసుకున్నాడు.

ఈ ఎస్.కె.-4 అనే రకం పెద్ద పెద్ద పసుపు కొమ్ములను ఇస్తుంది. ఇతను పండించిన పసుపు కొమ్ము ఒక్కోటి 8 కిలోల వరకు బరువు తూగింది. ఈ రకం పసుపు కేవలం తల్లి వేరు నుండే కాక, పిలకల నుండి కూడా అధిక దిగుబడిని ఇస్తుందని నిర్ధారించాడు సచిన్ కమలాకర్. బాలా సాహెబ్ కొంకణ్ విద్యాపీఠం వారి 'ప్రో-ట్రే' విత్తే పద్ధతి ద్వారా విజయవంతంగా ఈ విత్తనాన్ని అభివృద్ధి చేశాడు.

ఇతని ప్రయోగాలు విజయవంతం అయిన తర్వాత మహారాష్ట్ర ప్రాంతంలో 100 మంది రైతులకు ఒక లక్షకు పైగా విత్తనాలను అందించి వారి చేత నాటించి, మంచి దిగుబడిని 2021లో సాధించ గలిగాడు. ఎన్.ఐ.ఎఫ్. వారి సహకారంతో పిపివి & ఎఫ్.ఆర్. రిజిస్ట్రేషన్ కొరకు దరఖాస్తు చేయటం జరిగింది. నేను స్వయంగా పండించి అధిక దిగుబడిని పొందడమే కాక, తన రత్నగిరి ప్రాంతం మరియు మహారాష్ట్ర లోని చాలా మంది రైతులు ఇంకా అధిక దిగుబడి సాధించి, లాభపడటం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని అంటాడు సచిన్ కమలాకర్.

రైతులకు అధిక దిగుబడిని ఇచ్చే సరికొత్త రకం ఎన్కె-4 పసుపు విత్తనాన్ని అభివృద్ధి చేసినందుకు గాను సచిన్ కమలాకర్ కు ఎన్ఐఎఫ్ వారు తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023వ సంవత్సరంలో జాతీయ స్థాయి ద్వితీయ బహుమతి ఇచ్చి సత్కరించారు.

**(వచ్చే సంచికలో మరి కొన్ని పురస్కారాలు)**

# ఆయుర్వేద జ్ఞాన మథనం


ఉమా మహేశ్వర రావు

## వాతావరణ మార్పుల వల్ల కలిగే రోగాలకు వంటింటి వైద్యం

వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడల్లా చాలా మందికి ఏదో ఒక రకంగా జబ్బులు కలుగుతూ ఉంటాయి. ముఖ్యంగా జ్వరం, జలుబు, దగ్గు వచ్చే అవకాశాలు ఎక్కువ. వాటిని ఏదో ఒక మాత్ర వేసుకుని కొందరు నయం చేసుకుంటూ ఉంటారు. ఇది సహజంగా జరిగే ప్రక్రియ. ఈ సంవత్సరం చాలా ప్రాంతాల్లో వర్షాలు అధికంగా పడటం, గాలిలో తేమ శాతం విపరీతంగా పెరగటం వల్ల విపరీతమైన నొప్పులతో కూడిన జ్వరాలు, జలుబు, దగ్గులు రావటం జరుగుతోంది. గతంలో కొన్ని సంవత్సరాల క్రితం 'చికన్ గున్యా' అనే జ్వరం ఒక రకమైన దోమకాటు వల్ల వస్తోంది అన్నారు. ఇప్పుడు వస్తున్న జ్వరాలు కూడా అలాగే ఉన్నాయి కానీ, అంత తీవ్రమైన నొప్పులు కాకపోయినా, ముఖ్యంగా మోకాళ్ళు, మోచేతులు నొప్పిగా ఉండటం, వాపులు రావటం జరుగుతోంది. ఇటీవలే శాస్త్రవేత్తలు దీనికి 'మటన్ గున్యా' అని పేరు పెట్టినట్లు తెలుస్తోంది.

ఈ జ్వరం తగ్గటానికి రకరకాల మాత్రలు వేసుకుంటున్నారు, వాటివల్ల కడుపులో మంటగా ఉంటోంది, గ్యాస్ ఏర్పడుతోంది కానీ నొప్పులు, జ్వరం మాత్రం తగ్గటం లేదు అని చాలా మంది చెబుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి వైద్యులు రకరకాలుగా మాత్రలు మార్చి మార్చి ఇస్తున్నారు. కానీ చాలా కాలంగా పని చేస్తున్న ఆయుర్వేద వైద్యులు మాత్రం కొత్తగా ఆలోచించారు. శరీరంలో ఏ రోగం వచ్చినా దానికి పరిష్కారం తప్పక ఉంటుంది అని శోధించి మొత్తానికి ఒక విరుగుడు కనిపెట్టారు. ఈ వైద్యం ఇంట్లోని పదార్థాలతోనే చేసుకోవచ్చు, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా తగ్గిపోతుంది.

కాలమాణం ప్రకారం మనం తినే ఆహారంలో విపరీతంగా ప్రొటీన్స్ పెరిగి పోవటం వల్ల శరీరంలో సిఆర్‌టి లెవెల్స్ పెరిగి పోతున్నాయి. ఎన్ని రకాల టెస్టులు చేయించుకున్నా, అవి సాధారణంగా ఉన్నా, నొప్పులు మాత్రం పెరిగిపోతున్నాయి. సాధారణంగా సిఆర్‌టి లెవెల్స్ 1 నుండి 3 లోపు ఉండాలి. కానీ ఈ లెవెల్స్ 1 నుండి 25 -30కి పెరిగి పోతున్నాయి  అని గ్రహించారు. ఇలా జరగటం వల్ల వత్తిడి ముఖ్యంగా లివర్‌మీద పడుతుంది. అందువల్ల శరీరంలోని అన్ని రకాల ఆర్గాన్స్ పైన వత్తిడి పెరుగుతోంది.

ఇటువంటి వారు ముఖ్యంగా తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటంటే 'పులుపు' అనేది పూర్తిగా తగ్గించాలి. ఎక్కువ ద్రవ పదార్థ ఆహారం జావా లాంటివి తీసుకుంటూ ఉండాలి. విపరీతంగా ప్రొటీన్స్ ఉన్న ఆహారం పూర్తి మానెయ్యాలి. ఇక ఈ వ్యాధికి వైద్యం 'పంచామృతాలు' అంటే నెయ్యి, తేనె, పాలు, పెరుగు, పంచదార. వీటినే నాటి నుండి నేటికీ దేవాలయాల్లో 'తీర్థం' పేరుతో ఇస్తూ ఉంటారు. వీటిని మధుమేహం ఉన్నవారు కూడా తీసుకోవచ్చు. ఉదయం లేవగానే ఈ పంచామృతాన్ని తీసుకున్న తర్వాత ఏదైనా తాగవచ్చు. ఆహారం తీసుకున్న తర్వాత పంచామృతం తీసుకున్నట్లయితే షుగర్ లెవెల్స్ పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ఉదయం పరగడుపుననే తాగిలి. ఈ పంచామృతాన్ని కూడా ఎలా పడితే అలా కలిపి తయారు చేసుకోవద్దు. ఒక చెంచాడు తేనె, ఒక చెంచాడు నెయ్యి, మూడు చెంచాల పెరుగు, రెండు చెంచాల పాలు, పావు చెంచా పటిక బెల్లం లేదా పంచదార లేదా తాటి కలకండ లేదా బెల్లం ఈ నాలుగింటిలో ఏదో ఒకటి కలిపి తయారు చేసుకోవాలి. ఉదయం లేవగానే ముఖం కడుక్కుని పరగడుపున ఈ పంచామృతం సేవించి, ఒక పావు గంట తర్వాత వారికి కావలసిన కాఫీ, టీ, వేడి నీరు ఏదైనా తీసుకోవచ్చు. ఇలా రోజుకు ఒకసారి చొప్పున పది రోజులు చేస్తే 60 నుండి 70 శాతం నొప్పులు తగ్గిపోతాయి.

మరో ముఖ్య విషయం ఏమిటంటే ఒకటే రకం కూరను రెండు మూడు రోజుల పాటు వరుసగా తీసుకోవద్దు. అంటే ఒక వారం పాటు రోజూ ఒక రకం కూరగాయ లేదా ఆకు కూరలు తీసుకోవాలి. అంతే కాని, రెండు మూడు రోజులకోసారి ఒకసారి తిన్న కూరగాయ మళ్ళీ తినవద్దు. పులుపు, ఉప్పు బాగా తగ్గించాలి. డ్రై ఫ్రూట్స్ తినే అలవాటు ఉన్నవారు అలాంటివి ఈ రోగం తగ్గే వరకు పూర్తిగా మానెయ్యాలి. ఈ సమయంలో డ్రై ఫ్రూట్స్ అంత ప్రమాదకరమైనవి మరొకటి లేవు అని గుర్తుంచుకోవాలి.

ఇంకో విషయం ఏమిటంటే ఆహారం అనగానే ప్రధానంగా రోజుకు మూడు పూటలా 'అన్నం' తింటూ ఉంటారు కొందరు. అలా కాకుండా ఒక పూట రొట్టె, ఒక పూట భోజనం, మూడో పూట చిరు ధాన్యాలు (మిల్లెట్స్) తో ఆహారం వీలైతే ద్రవరూపంలో జావ లాగా తయారు చేసుకుని తీసుకుంటే మంచిది.

ఒకరోజు 95 సంవత్సరాల వయసున్న వీరి అమ్మగారు పంచామృతం గురించి చెప్పింది. అలా చెప్పగానే వీరి బంధువుల్లో ఒకరికి జ్వరం, నొప్పులు ఉన్నాయని చెప్పగా ఈ వైద్యం చెప్పడం జరిగింది. ఆమె ఆచరించిన మూడవ రోజే ఫోన్ చేసి, ఎన్ని మాత్రలు వేసుకున్నా తగ్గని నొప్పులు మీరు చెప్పినట్లు చేస్తే మూడవ రోజుకే 40-50 శాతం నొప్పులు తగ్గాయి అన్నది. అంత ప్రభావ వంతంగా పని చేస్తుంది మన పూర్వ వైద్యం. కాబట్టి 'మటన్ గున్యా' జ్వరంతో బాధ పడుతున్న వారు ఎటువంటి అనవసరపు మాత్రలు వేసుకోకుండా, పైన చెప్పిన విధంగా చేసుకున్నట్లయితే ఆరోగ్యం త్వరగా కుదుట పడుతుంది. విపరీతమైన మాత్రలు వేసుకుని, కిడ్నీలు, లివర్ లకు హాని కలుగకుండా చూసుకోండి.





**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

# మునగ ఆకుతో ఆరోగ్య చిట్కాలు


'వైద్య' కొమెర జాజి

మునగ చెట్టు నుండి లభించే ఆకు, కాయల వల్ల మన ఆరోగ్యానికి చేకూర్చే లాభాలు ఎన్నో ఉన్నాయి. వాటిని గురించి తెలుసుకుందాం.

లేత మునగ ఆకును తీసుకుని, శుభ్రంగా నీటిలో కడిగి రోట్లో వేసి మెత్తగా దంచుకోవాలి. రోలు సౌకర్యం లేనివారు మిక్సీలో అయినా వేసుకోవచ్చు. దంచేటపుడు అవసరమైతే కొద్దిగా నీటిని చిలకరించుకుని దంచుకోవచ్చు. ఆ తర్వాత అందులోనే ఒక అరటి పండును వేసి మొత్తం బాగా కలపాలి. ఆ తర్వాత ఆ ముద్దను తీసి ఒక గుడ్డలో వేసి అందులోని రసాన్ని పిండాలి. ఇంకా కొద్దిగా తియ్యగా ఉండాలి అనుకునే వారు కొద్దిగా శుద్ధమైన తేనెను కలుపుకోవచ్చు. ఈ రసాన్ని ఉదయం పరగడుపుననే తీసుకున్నట్లయితే గుండెకు చాలా మంచిది. గుండెదడ, భయం భయంగా వున్న వారికి చాలా మంచిది. ధూమపానం చేసే వాళ్ళు దీన్ని అప్పుడప్పుడూ తీసుకుంటూ ఉన్నట్లయితే వారిలో గుండెకు రక్త ప్రసరణ చాలా బాగా జరుగుతుంది. భవిష్యత్తులో గుండె జబ్బు రాకుండా నివారిస్తుంది. నరాల్లో కొవ్వు పేరుకు పోయి వున్న వాళ్ళు ఈ రసాన్ని తీసుకున్నట్లయితే నరాల్లోని కొవ్వును కరిగించి, రక్త ప్రసరణ బాగా జరిగేటట్లు చేస్తుంది.

మునగ ఆకు జ్యూస్‌గానే కాకుండా కషాయం చేసుకుని తీసుకున్నా చాలా బాగా పని చేస్తుంది. గుప్పెడు మునగ ఆకు తీసుకుని ఒక పాత్రలో వేసి, అందులో ఒక గ్లాసు నీరు పోయాలి. ఆ నీటిని పొయ్యిమీద పెట్టి ఆ నీరు అర గ్లాసు అయ్యేదాకా వేడి చెయ్యాలి. ఆ తర్వాత ఆ నీటిని వడబోసుకుని, అందులో కొంత చక్కెర లేదా తేనె లేదా బెల్లం వేసుకుని ఉదయాన్నే సేవించాలి. ఇలా చేసినా కూడా పైన చెప్పిన విధంగానే గుండెకు చాలా మంచిది. రక్త ప్రసరణ సవ్యంగా జరిగేలా చేస్తుంది.

లేత మునగ ఆకులను తీసుకుని కూర చేసుకుని తిన్నట్లయితే అతి మూత్రం వ్యాధి ఉన్నవారికి చాలా త్వరగా తగ్గిపోతుంది. మలబద్ధక సమస్య పూర్తిగా తొలగిపోతుంది. మునగాకు కూర తరచుగా తినటం వల్ల గ్యాస్ ఉబ్బరం, అజీర్తి సమస్య, నులి పురుగులు, ఏలిక పాములు, కడుపులో వున్న దాదాపు అన్ని రకాల సమస్యలను తొలగిస్తుంది.







మునగ ఆకు లేతది అయినా ముదురు ఆకు అయినా సరే అన్నీ కలిపి అయినా తీసుకుని నీడలో బాగా ఆరబెట్టుకుని, బాగా ఎండిన తర్వాత పొడి చేసుకుని ఒక సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజు ఒకసారి నీళ్ళలో లేదా పాలలో అర స్పూను పొడిని వేసుకుని త్రాగుతూ ఉన్నట్లయితే ఉదర దోషాలన్నీ తొలగిపోతాయి.

మునగ పూత గుప్పెడు సేకరించి, దాన్ని ఆవు నెయ్యిలో వేసి పెనంమీద కాచి తీసుకున్నట్లయితే స్వప్న స్కలనం, శీఘ్ర స్కలనం తో పాటు వీర్య దోషాలను కూడా నివారిస్తుంది. పెనంమీద ఆవు నెయ్యి వేసుకుని అందులో మునగ కాయలను వేసి బాగా వేయించుకోవాలి. నెయ్యి మొత్తం మునగ కాయలకు పట్టేలా వేయించాలి. వీలైతే మునగ కాయలను నిలువుగా కోసి వేయించినా కూడా చాలా మంచిది. ఇలా చేసిన వేపుడు మునగ కాయలు అమితమైన రుచి కలిగి ఉంటాయి. ఇలా చేసినా కూడా శీఘ్ర స్కలనం, స్వప్న స్కలనం, వీర్య దోషాలు నివారించ బడుతాయి.

మునగ కాయలను తీసుకుని పప్పు, చారు, కూర, చట్నీ లాంటి ఆహార పదార్థాలు చేసుకుని తరచూ తీసుకుంటూ ఉన్నట్లయితే జీర్ణశక్తి బాగా పెంపొందుతుంది. ఇది ఒంట్లో వేడిని పెంపొందిస్తుంది. మునగ ఆకును గుప్పెడు తీసుకుని పప్పులో వేసుకుని తిన్నా కూడా జీర్ణ క్రియకు చాలా మంచిది. తోటకూర, పాలకూరలకన్నా ఇది ఇంకా సమర్థవంతంగా పని చేస్తుంది. మునగ కాయలతో రసం, సాంబారు చేసుకుని తిన్నా కూడా శరీరానికి ముఖ్యంగా కడుపులోని కల్మషాలను నివారించటం లో చాలా బాగా ఉపయోగ పడుతుంది.

### గాయాలు, పుండ్లు, మోకాళ్ళ నొప్పులకు మునగ ఆకుతో చికిత్స:

శరీరంపైన గాయాలు, పుండ్లు అయిన వారు, మోకాళ్ళ నొప్పులు, కాళ్ళ వాపులు, శరీరంలోని ఇతర అవయవాలలో వాపులు ఉన్నవారు గుప్పెడు మునగ ఆకును తీసుకుని, వాటిని ఒక పాత్రలో వేసి, అందులో సగం గ్లాసు నీళ్ళు పోసి, ఆ నీరు బాగా మరిగే వరకు కాచి, తర్వాత ఆ ఆకును తీసుకుని, వాటిని తమలపాకు పైన వేసి, శరీరంలో నొప్పులు, పుండ్లు, వాపులు, గడ్డలు ఉన్నచోట పెట్టి ఒక గుడ్డతో కట్టు కట్టినట్లయితే అక్కడ ఉన్న నొప్పులు త్వరగా తగ్గిపోతాయి.

### తల నొప్పితో సహా అన్ని రకాల నొప్పులను నయం చేసే మునగాకు చికిత్స:

తలనొప్పి విపరీతంగా ఉన్న వారు కూడా ఇలాగే ఆకును వేడి చేసి, ఒక గుడ్డలో వేసుకుని మూటలాగా తయారు చేసుకుని తలపై ఆ వేడి గుడ్డను అద్దుతూ ఉన్నట్లయితే తలనొప్పి త్వరగా తగ్గిపోతుంది. అంతే శరీరంలో ఎక్కడ నొప్పులు వున్నా కూడా ఇలాగే వేడి ఆకు ముద్ద కట్టిన గుడ్డను అదుముతూ ఉన్నట్లయితే అన్ని రకాల నొప్పులు తగ్గిపోతాయి. ●

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700

వీర రాఘవ రెడ్డి గారు,

మీరు, మీ బృందం 'పల్లెసృజన' ద్వారా రైతులకు అందిస్తున్న వినూత్న పరికరాలు, విత్తనాలు, మొక్కలు రైతులకు ఎంతగానో ఉపయోగ పడటంతో పాటు, పెట్టుబడి ఖర్చులను గణనీయంగా తగ్గిస్తున్నాయి. మిమ్మల్ని, మీ పరికరాల ప్రదర్శనను తప్పక చూసి, మిమ్మల్ని, మీ ఇన్నోవేటర్లను అభినందించాలన్న కోరికతో పుట్టపర్తి, తాడిపత్రి, పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రాంతాల నుండి 'గద్వాల రైతు సదస్సు'కు రావటం జరిగింది. ఇక్కడ మీ పరికరాలు, యంత్రాల ప్రదర్శన చూస్తుంటే మాకు ఆశ్చర్యం వేసింది. మీ ఇన్నోవేషన్లను ప్రత్యక్షంగా చూడటంతో మేము అంత దూరం నుండి వచ్చినందుకు ఈ ప్రయాణం సఫలం అయింది అని ఆనందంతో తిరిగి వెళ్తున్నాము. వీలైనంత త్వరలో మాకు అవసరమైన ఇన్నోవేషన్లను తప్పక మీ ద్వారా తెప్పించుకుంటాము. ఈ పరికరాలు, యంత్రాలు ఎవరో పెద్దపెద్ద సంస్థలు తయారు చేసినవి అనిపించే విధంగా గ్రామాల్లోని, ఏమీ చదువుకోని, రైతుకుటుంబం నేపథ్యంలో నుండి వచ్చిన వారు తయారు చేశారు అంటే నిజంగా మాకెంతో ఆశ్చర్యం వేసింది. వీటికి ఏదైనా రిపేర్లు వస్తే మళ్ళీ కంపెనీల చుట్టూ తిరగాల్ని పని లేకుండా, ఏవైనా పనిముట్లు అరిగి పోవటం, విరిగి పోవటం లాంటివి జరిగితే మళ్ళీ మీకు ఫోన్ చెయ్యాల్సిన అవసరం లేకుండా ఎక్కడికక్కడే స్థానిక మెకానిక్‌లతో రిపేర్లు చేయించుకోవచ్చు, మీ గ్రామాలకు సమీపంలోని పట్టణాల్లో ఆ పరికరాలను తయారు చేయించుకోవచ్చు అని తెలిసి ఆశ్చర్యానికి గురయ్యాము. చిన్న చిన్న పనిముట్లు, యంత్రాలు హోండా లాంటి సంస్థలు తయారు చేస్తున్నా వాటిని కొనుగోలు చేయలేక పోవటానికి ప్రధాన కారణం వాటి రిపేర్ల కొరకు కంపెనీల చుట్టూ తిరిగే ఓపిక, సమయం రైతుకు లేకపోవటం అని మాకు తెలుసు. ఈ సమస్యకు సులభమైన పరిష్కారాలను వెలుగులోకి తెచ్చిన మీ 'పల్లెసృజన' బృందానికి, వాటిని తయారు చేసిన ఇన్నోవేటర్లకు హృదయపూర్వక ధన్యవాదములు. మీరు ఇలాంటి ఇంకా ఎన్నో రకాల రైతుకు ఖర్చును, శ్రమను తగ్గించే ఎన్నో పరికరాలు, యంత్రాలను వెలుగులోకి తీసుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మీకు హృదయపూర్వ కృతజ్ఞతలు తెలియేస్తున్నాము.

– **బాయరెడ్డి**, పుట్టపర్తి; **రవివర్మ రెడ్డి**, తాడిపత్రి; **ప్రభాకర రెడ్డి**, ఎమ్మిగనూరు, **చంద్రశేఖర్**, పత్తికొండ.

రైతు మిత్రులు అందరికీ ధన్యవాదములు,

మీరు చూపిన ఆదరణ మేమెన్నటికీ మరువబోము, కేవలం 'పల్లెసృజన' ఇన్నోవేషన్లు చూడటానికి మీరు ఎంతో దూరం నుండి ఖర్చులు పెట్టుకొని రావటం మాకెంతో ఆనందంగా అనిపించింది. మీరు కనీసం ముఖ పరిచయం కూడా లేకున్నా, మేము పంపే వాట్సయాప్ గ్రూపుల ద్వారా మా ఇన్నోవేటర్ల ప్రతిభను గుర్తించి, వాటిని ప్రత్యక్షంగా చూడాలి అన్న మీ తపన మాకెప్పటికీ గుర్తుంటుంది అని సవినయంగా తెలియజేస్తున్నాము. మీ సహకారాలను పల్లెసృజనతో ఎల్లప్పుడూ కొనసాగాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాము.

– **వీరరాఘవ రెడ్డి**. ఎడిటోరియల్ బోర్డు సభ్యులు

# శ్రద్ధాంజలి



పల్లెసృజన మహిళా ఇన్నోవేటర్
కీ.శే. **శ్రీమతి దూబ రాజు** గారు
నిర్యాణము : 29-9-2024

'పల్లెసృజన' మహిళా ఇన్నోవేటర్ శ్రీమతి దూబ రాజు గారు **29-9-2024** న పరమ పదించారు అని తెలియజేయటానికి చింతిస్తున్నాము.

కొన్ని రకాల మూలికలు, ఆకులను మేళవించి పాత్రల శుభ్రతకు, ఇంట్లో బండలు శుభ్రం చేయటం కోసం, ముఖ్యంగా టమోట ఎక్కువ రోజులు నిల్వ ఉండటం కోసం ఇలా కొన్ని రకాల రసాయన రహిత ద్రావణాలను తయారు చేయటం వల్ల మన 'పల్లెసృజన' కుటుంబానికి 2018లో పరిచయమైంది కీ.శే. శ్రీమతి దూబ రాజు గారు. ఈమె తయారు చేసిన ద్రావణాలకు అంతర్జాతీయ ఖ్యాతి కూడా లభించింది. 2020లో 87 దేశాల ఇన్నోవేటర్లతో, 2,500 ఎంట్రీలను సమీక్షించి ప్రముఖ నిష్ణాతులచే వీటిని పరీక్షించిన తర్వాత నిపుణుల జ్యూరీ 11 మంది ఇన్నోవేటర్లను అంతర్జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. అందులో మన ఇన్నోవేటర్ శ్రీమతి దూబ రాజు గారు ఒకరు.

అనతి కాలంలోనే అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన మన ఇన్నోవేటర్ శ్రీమతి దూబ రాజు ఇక మన మధ్య లేరు అని తెలియజేయటానికి చింతిస్తూ, బాధాతప్త హృదయంతో వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

**– పల్లెసృజన కుటుంబం, ఫోన్:**

పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఇన్నోవేషన్లు

# కొబ్బరి బోండాంల ష్రెడ్డర్

## ఉపాధితో పాటు ఊరు పరిశుభ్రం



ఇన్నోవేటర్
అల్లాడి ప్రభాకర్
జగిత్యాల జిల్లా
తెలంగాణ

1. ఒక కొబ్బరి బోండాం భూమిలో కలిసి పోవటానికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది.
2. దాని ఉప ఉత్పత్తులతో ఎంతో ఉపయోగం లాభదాయకం.
3. కొబ్బరి బోండాం నుండి లభించే పీచు, కోకోపిత్ వల్ల సమాజానికి ఎన్నో లాభాలు.
4. ఈ యంత్రం తో సులభంగా కొబ్బరి బోండాం నుండి పీచును, కోకోపిత్‌ను వేరు చేయవచ్చు.
5. ఈ యంత్రంలో సింగల్ ఫేస్ మరియు 3 ఫేస్ విద్యుత్‌తో నడిచే 3 హార్స్‌పవర్‌ల మోటారు బిగించబడింది.
6. ఈ యంత్రాన్ని ఉపయోగించడం చాలా సులువు. ఎలాంటి ప్రత్యేకమైన శిక్షణ అవసరం లేదు.
7. ఈ మిషన్ గంటకు సుమారు 200 కొబ్బరి బోండాంలను క్రష్ చేస్తుంది.
8. మీ గ్రామం లేదా పట్టణం శుభ్రంగా ఉండటానికి మీవంతు సహకారం అందించవచ్చు.
9. ఈ యంత్రం ద్వారా చిన్నపాటి పరిశ్రమ ఏర్పాటు చేసుకొని నలుగురికి ఉపాధి అవకాశం కల్పించవచ్చు.







honeybee.org
nifindia.org

వివరాలకు సంప్రదించండి

పల్లెసృజన

77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-49253096, 9866 00 1678
81257 99904, 96528 01700
E-mail : president@pallesrujana.org
Visit us : www.pallesrujana.org

పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఇన్నోవేషన్లు

# వంగిన కరెంటు స్తంభాలను సరిచేసే పరికరం

## శ్రమ, ఖర్చు, సమయం అన్నీ తక్కువే



ఇన్నోవేటర్
అల్లాడి ప్రభాకర్
జగిత్యాల జిల్లా
తెలంగాణ

1. ఒకవైపు ఒరిగిపోయిన సిమెంటు కరెంటు స్తంభాలను చక్కగా నిలబెట్టాలంటే ఎంతో శ్రమ, ఖర్చు, సమయం అవసరం.
2. సాధారణంగా ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 5-6 మంది బలమైన వ్యక్తులు, ఒక ట్రాక్టరు అవసరం, ఒక్క స్తంభం నిలబెట్టడానికి కనీసం 5-6 గంటల సమయం పడుతుంది.
3. ఈ సమస్యకు పరిష్కారంగా కేవలం 1-2 గంటల్లో ఇద్దరు లేదా ముగ్గురు సాధారణ వ్యక్తులు అలుపు లేకుండా స్తంభాన్ని నిటారుగా నిలబెట్టవచ్చు.
4. ట్రాక్టరు అవసరమే లేదు, ఈ పరికరాన్ని కేవలం మోటార్ సైకిల్ పైన ఎక్కడికైనా తీసుకు వెళ్ళవచ్చు.
5. ఈ పనికి అవసరమైన రెండు ప్రత్యేకమైన చిన్న పనిముట్లు కూడా తయారు చేయబడ్డాయి.
6. ఒక్కరోజులో కనీసం 4-5 స్తంభాలను నిటారుగా నిలబెట్టవచ్చు.
7. పంట పొలాల్లో అయినా సరే రైతుకు ఎటువంటి నష్టం వాటిల్ల కుండా పని పూర్తి చేయవచ్చు.
8. విద్యుత్ శాఖకు ఎంతో ఊరట, సమయం, ఖర్చు తక్కువ.
9. విద్యుత్ శాఖకు లక్షలాది రూపాయలను ఆదా చేసే పరికరం.
10. స్తంభాలను త్వరగా సరిచేస్తే ప్రమాదాలు తగ్గుతాయి.








honeybee.org
nifindia.org

వివరాలకు సంప్రదించండి

పల్లెసృజన

77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-49253096, 9866 00 1678
E-mail : president@pallesrujana.org
Visit us : www.pallesrujana.org

Marketing by :
PALLE KISAN

PALLE SRUJANA Telugu Bi-monthly Sept.-Oct. 2024 RNI No. TELTEL/ 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే



పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

లేదా

"Phone Pe"
no 9866 00 1678

QR code for Phone Pe

'గూగుల్ పే/ ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు లేదా ఈ క్యుఆర్ కోడ్ ద్వారా పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్సయాప్‌లో పంపండి.

### సభ్యత్వ వివరాలు (ఒక సంవత్సరానికి)

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| మామూలు పోస్టు ద్వారా | 200/- | 1000 |
| రిజిష్టరు పోస్టు ద్వారా | 320/- | 1120/- |